RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి | సంపుటి : 2 సంచిక : 43 | ఆదివారం, మార్చి 10, 2024 | పేజీలు : 4


## ఆర్టీసీ ఉద్యోగులకు 21 శాతం ఫిట్‌మెంట్ : మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ : ఆర్టీసీ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త వినిపించింది. జూన్ 1 నుంచి కొత్త ఫిట్‌మెంట్ అమలు చేయనున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. కొత్త ఫిట్‌మెంట్‌తో ఆర్టీసీపై నెలకు రూ. 35 కోట్ల భారం పడనుందని తెలిపారు. 53,071 మంది ఆర్టీసీ ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనం చేకూరనుందని మంత్రి స్పష్టం చేశారు.

### అరుణాచల్ ను సందర్శిస్తే...

# 'మోడీ గ్యారంటీ'

## ఏంటో అర్థమవుతుంది: ప్రధాని



ఇటానగర్ : ఈశాన్య ప్రాంతంలో గడచిన ఐదు సంవత్సరాలలో తన ప్రభుత్వం సాగించిన తరహా అభివృద్ధి కార్యక్రమాలకు కాంగ్రెస్ పార్టీకి 20 సంవత్సరాలు పట్టేదని ప్రధాని నరేంద్ర మోడీ శనివారం అన్నారు. ఈశాన్య ప్రాంతంలో రూ. 55600 కోట్లు విలువ చేసే అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభించిన తరువాత ప్రధాని మోడీ అరుణాచల్ ప్రదేశ్ రాజధాని ఇటానగర్‌లో 'వికసిత్ భారత్ వికసిత్ ఈశాన్యం' కార్యక్రమంలో మాట్లాడారు. 'దక్షిణాసియా, తూర్పు ఆసియాతో భారత వాణిజ్య, పర్యాటక, ఇతర సంబంధాలలో ఈశాన్య ప్రాంతం దృఢమైన అనుసంధానం కాబోతున్నది. ఇప్పుడు ఇక్కడ రూ. 55600 కోట్లు విలువ చేసే ప్రాజెక్టులను ఆవిష్కరించడమైంది' అని ప్రధాని తెలియజేశారు. 'ఈశాన్య ప్రాంతంలో గడచిన ఐదు సంవత్సరాలలో మేము చేసిన తరహా పనికి కాంగ్రెస్‌కు 20 సంవత్సరాల వ్యవధి పట్టి ఉండేది' అని మోడీ చెప్పారు. అరుణాచల్ ప్రదేశ్ సందర్శించేవారికి 'మోడీ గ్యారంటీ' అంటే ఏమిటో స్పష్టం అవుతుందని ప్రధాని అన్నారు. 'మోడీ గ్యారంటీ పని ఎలా పని చేస్తున్నదో మొత్తం ఈశాన్య ప్రాంతం చూస్తున్నది' అని ఆయన చెప్పారు. దేశం అభివృద్ధి నిమిత్తం తాను పాటు పడుతుంటే ప్రతిపక్ష కూటమి 'ఇండియా' నేతలు తనను 'విమర్శిస్తున్నారు' అని కూడా ప్రధాని చెప్పారు. తవాంగ్‌కు అన్ని కాలాల్లో అనుసంధానం కలిగించే సెలా సొరంగ మార్గాన్ని మోడీ శనివారం ప్రారంభించారు. 2019లో శంకుస్థాపన కార్యక్రమం తరువాత సెలా సొరంగ మార్గం ప్రారంభం 'మోడీ గ్యారంటీకి నిదర్శనం' అని ఆయన చెప్పారు. 'ఎన్నికల అజెండాగా వ్యూహాత్మక సొరంగ మార్గానికి నేను శంకుస్థాపన చేశానని కొందరు భావించారు. కానీ ఇప్పుడు వారి అంచనా తప్పింది' అని మోడీ చెప్పారు.

### ఏపిలో బిజెపితో టిడిపి, జనసేన...

# పొత్తు ఖరారు

న్యూఢిల్లీ: ఏపీ రాజకీయాలు మరో కీలక మలుపు తీసుకుంటున్నాయి. దాదాపు ఆరేండ్ల తరువాత తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు బిజెపితో ఎన్నికల పొత్తు కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ఢిల్లీలో శనివారం రోజు ఉదయం కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షాని ఆయన నివాసంలో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌లు కలిసి పుష్పగుచ్చాలు అందజేశారు. కాగా ఎపిలో త్వరలో జరుగనున్న అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో టిడిపి, బిజెపి, జనసేన కలిసి పనిచేయాలని నిర్ణయించామని తెలుగుదేశం పార్టీ ఏపీ అధ్యక్షుడు కే అచ్చెన్నాయుడు శుక్రవారం ఏపిలో వెల్లడించారు. ఈ మేరకు ఢిల్లీలో మూడు పార్టీల మధ్య సీట్ల సర్దుబా టు చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్‌షా, బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డాతో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చర్చలు జరిపారు. కాగా పొత్తుల్లో ఆ పార్టీలు అవగాహనకు వచ్చా యని, బిజెపి , జనసేన పార్టీలకు 30 అసెంబ్లీ, 8 లోక్‌సభ స్థానాలు ఇచ్చేందుకు టిడిపి అంగీకరించిందని విశ్వసనీయంగా తెలుస్తోంది. మిగతాచోట్ల టిడిపి పోటీ చేసేలా అంగీకారం కుదిరినట్టు సమాచారం. బిజెపి ఐదు, జనసేన మూడు సీట్లలో పోటీ చేయనున్నట్టు తెలిసింది. అరకు, రాజమండ్రి, నరసాపురం, తిరుపతి, రాజంపేట స్థానాల్లో బిజెపి, అనకాపల్లి, కాకినాడ, మచిలీపట్నం సీట్లలో జనసేన పోటీచేయనున్నట్టు సమాచారం.




పొత్తు పొడిచింది: జనసేన, బిజేపీలకు ఎన్ని సీట్లంటే...

తెలుగుదేశం, బిజేపి, జనసేన మధ్య పొత్తు కుదిరింది. ఢిల్లీలో అమిత్ షాతో చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ జరిపిన సుదీర్ఘ మంతనాల అనంతరం సీట్ల పంపకంపై ఒక కొలిక్కి వచ్చినట్లు తెలిసింది. జనసేన, బిజేపీలకు 8 లోక్ సభ, 30 అసెంబ్లీ సీట్లు ఇచ్చేందుకు తెలుగుదేశం పార్టీ అంగీకరించినట్లు తెలుస్తోంది. మిగిలిన 17 లోక్ సభ, 145 అసెంబ్లీ స్థానాల్లో తెలుగుదేశం పోటీ చేస్తుంది. ఒప్పందం ప్రకారం అరకు, నరసాపురం, రాజమండ్రి, తిరుపతి, హిందూపూర్, రాజంపేట లోక్ సభ స్థానాల్లో బిజేపీ పోటీ చేస్తుంది. కాకినాడ, మచిలీపట్నం, అనకాపల్లి స్థానాల్లో రెండు చోట్ల జనసేన బరిలోకి దిగుతుంది.

## ఎల్బీనగర్ టు హయత్‌నగర్ మెట్రోను పొడిగిస్తాం: సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ మార్చి, 9 :** ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్‌కు మెట్రోను పొడిగిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఎల్బీనగర్ వద్ద బైరామల్ గూడ కూడలిలో నిర్మించిన వంతెనను శనివారం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగర ప్రజల అవసరాలు తీర్చేలా మెట్రో రైలును విస్తరిస్తామని చెప్పారు. రాజేంద్రనగర్‌లో హైకోర్టు నిర్మించి అక్కడి వరకు మెట్రో నిర్మిస్తామని తెలిపారు. హైదరాబాద్ చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మించింది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న అన్ని మున్సిపాలిటీలను హెచ్‌ఎండిఎ పరిధిలోకి తీసుకొస్తామన్నారు. భవిష్యత్ లో నిర్మించే రీజనల్ రింగ్ రోడ్డుతో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. మూసీ నదిని రూ.50 వేల కోట్లతో ఆధునీకరిస్తామని తెలిపారు. వైబ్రంట్ తెలంగాణ 2050 పేరుతో మాస్టర్ ప్లాన్ రూపొందించామని సిఎం రేవంత్ చెప్పారు. కాగా, ఎస్ఆర్ డిపిలో భాగంగా రూ.148.5 కోట్లతో బైరామల్ గూడ కూడలిలో సెకండ్ లేవల్ వంతెనను నిర్మించారు. ఈ ఫ్లైఓవర్ శంషాబాద్, ఓవైసీ ఆస్పత్రి నుంచి బిఎన్ రెడ్డి నగర్, సాగర్ వైపు వెళ్లే వాహనాలకు, చింతలకుంట చెక్ పోస్టు అండర్ పాస్ నుంచి హయత్ నగర్ వెళ్లే వాహనాలకు ఉపయోగపడుతోంది. ఈ ఫ్లై ఓవర్‌తో ఎల్బీనగర్-సాగర్ రింగ్ రోడ్డు ప్రాంతంలో ట్రాఫిక్ కష్టాలు తగ్గనున్నాయి.



## ఈనెల 12వ తేదీన సిఎం అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం



**హైదరాబాద్ మార్చి, 9 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం ఈ నెల 12వ తేదీన జరుగనుంది. ఈ కేబినెట్‌లో పలు కీలకమైన అంశాలపై చర్చించి ఆమోదం తెలువనున్నారు. సచివాలయంలో మంగళవారం ఉదయం 12 గంటలకు సమావేశం జరిగేలా ప్రాథమికంగా షెడ్యూల్‌ను ప్రభుత్వం రూపొందించింది. అందులో భాగంగా నిర్దిష్టమైన ఎజెండా రూపొందించనున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం లాంఛనంగా భద్రాచలంలో ప్రారంభించనున్న నేపథ్యంలో హడ్కో నుంచి రూ. 3 వేల కోట్ల మేర రుణాలు సమకూర్చుకోడానికి హౌజింగ్ బోర్డుకు ప్రభుత్వం ఇప్పటికే అనుమతి ఇచ్చింది. ఈ విషయాన్ని మంత్రివర్గ సమావేశంలో చర్చించి ఆమోదం తెలుపనున్నారు.

## ఏనుగుపై ప్రధాని మోడీ విహారం



కజిరంగ(అసోం): ప్రధాని నరేంద్ర మోడీ శనివారం అసోంలోని జాతీయ కజిరంగ జాతీయ అభయారణ్యం, పులుల సంరక్షణ కేంద్రంలో పర్యటించారు. కజిరంగలో జీపులో సఫారీ నిర్వహించారు. ఏనుగు ఎక్కి కొంతసేపు విహరించారు. యునెస్కో గుర్తింపు పొందిన ఈ అభయారణ్యానికి ప్రధాని మోడీ రావడం ఇదే తొలిసారి. రెండు గంటలు ఇక్కడ గడిపారు. దేశ ప్రధాని ఒక్కరు 1957 తరువాతఈ అభయారణ్యానికి రావడం ఇదే తొలిసారి. రెండు రోజుల పర్యటనకు ప్రధాని మోడీ శుక్రవారం సాయంత్రం అసోంకు వచ్చారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో గోలాఘాట్ జిల్లాలోని కజిరంగకు చేరారు. రాత్రిపూట ఈ జాతీయ పార్క్‌లోనే బస చేశారు. ఉదయం పూట ఏనుగు ఎక్కి విహరించిన ప్రధాని తరువాత అడవి అంతా జీపు సఫారీ చేశారు. ప్రకృతి అందాలను, జంతువులను కెమెరాతో క్లిక్ మన్పించారు. మోడీ వెంబడి పార్క్ డైరెక్టర్ సోనాలీ ఘోష్, అటవీశాఖాధికారులు ఉన్నారు. ఇక్కడ ఖడ్గమృగాలు ఎక్కువగా ఉంటాయని అన్నారు. అయితే తనకు ఎక్కువగా ఏనుగులు కన్పించాయని ప్రధాని వ్యాఖ్యానించారు. పూర్తిగా ఫారెస్టు ఆఫీసర్ల సఫారీ డ్రెస్‌తో నెత్తిన టోపీతో ఆయన ప్రద్యుమ్న గజంపై సాగారు. మావటి రాజు ఏనుగును నడిపించారు. కాగా 16 ఏనుగుల బృందం ఈ సఫారీ క్రమంలో అనుసరించింది. ఈ పార్క్ సందర్శన క్రమంలో ప్రధాని మోడీ మహిళా అటవీ సంరక్షకుల బృందం వనదుర్గతో ముచ్చటించారు. వారి సాధకబాధకాలు తెలుసుకున్నారు. వారి ధైర్యసాహసాలను కొనియాడారు. ఈ జాతీయ పార్క్ సందర్శనకు తరలిరావాలని, ఇక్కడి పలు అందాలు మీ ముందుంచుతున్నానని ప్రధాని ఆ తరువాత ట్వీట్ వెలువరించారు.

### మిస్ వరల్డ్-2024గా చెక్ రిపబ్లిక్ సుందరి...

# క్రిస్టినా పిస్కోవా

మిస్ వరల్డ్-2024 కిరీటం చెక్ రిపబ్లిక్‌కు దక్కింది. ఆ దేశం నుంచి ప్రాతినిథ్యం వహించిన క్రిస్టినా పిస్కోవా మిస్ వరల్డ్ కిరీటాన్ని అందుకున్నారు. ముంబయి వేదికగా అట్టహాసంగా జరిగిన ఈ వేడుకలో 112 దేశాలకు చెందిన అందాల భామలు పోటీ పడ్డారు. టాప్-4లో క్రిస్టినా పిస్కోవా (చెక్ రిపబ్లిక్), యాస్మిన్ అజైటౌన్ (లెబనాన్), అచే అబ్రహాంస్ (ట్రినిడాడ్ అండ్ టుబాగో), లీసాగో చోంబో (బోట్స్వానా)లు నిలిచారు. చివరి వరకూ ఉత్కంఠగా సాగిన పోటీలో మిస్ వరల్డ్ కిరీటం క్రిస్టినాకు దక్కింది. రన్నరప్‌గా లెబనాన్‌కు చెందిన అజైటౌన్ నిలిచారు. ఎన్నో అంచనాల మధ్య పోటీలో నిలిచిన భారత్‌కు ఈసారి నిరాశే ఎదురైంది. దేశం నుంచి ప్రాతినిథ్యం వహించిన కన్నడ భామ సినీశెట్టి టాప్-8కు పరిమితమయ్యారు. ఇతర దేశాల అందాల భామలకు గట్టి పోటీ ఇచ్చినా, అజైటౌన్ (లెబనాన్) టాప్-4కు ఎంపిక కావడంతో సినీ శెట్టి అక్కడి నుంచి వెనుదిరిగాల్సి వచ్చింది. ఇక ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన నీతా అంబానీ.. మిస్ వరల్డ్ హ్యుమానిటేరియన్ అవార్డును అందుకున్నారు. మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ ఛైర్ ఉమెన్ జూలియా మోర్లీ ఈ అవార్డును ప్రదానం చేశారు




### ఎలక్షన్ కమిషనర్ గోయల్

# రాజీనామా

న్యూఢిల్లీ : ఎలక్షన్ కమిషనర్ అరుణ్ గోయల్ శనివారం తమ పదవికి రాజీనామా చేశారు. త్వరలోనే లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలవడాల్సి ఉంది. ఈ దశలో కేంద్ర ఎన్నికల సంఘం (సిఇసి) పరిణామం కలవరానికి దారితీసింది. గోయల్ రాజీనామాను వెంటనే భారత రాష్ట్రపతి ఆమోదించారు. దీనితో ఇప్పుడు ఎన్నికల సంఘంలో ఇక నిర్వాహణాధికారిగా కేవలం ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఒక్కరే నిలిచారు. సాధారణంగా ఎన్నికల అధికారులుగా లేదా కమిషనర్లుగా ఇద్దరు ఉండాలి. కానీ ఒక్క స్థానం ఇప్పటికే ఖాళీగా ఉంది. మిగిలిన అరుణ్‌గోయల్ రాజీనామా చేశారు.



ఎన్నికల తేదీల షెడ్యూల్ ఎప్పుడెప్పుడా అని పార్టీలు ప్రజలు ఎదురుచూస్తున్న దశలో ఈ రాజీనామా, దీనికి ఆమోదం చకచకా జరిగిపొయ్యాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ లోక్‌సభ ఎన్నికల తేదీలను వచ్చే వారంలో ఏ తేదీన అయినా ప్రకటిస్తారని అంతా భావిస్తూ వస్తున్నారు. అయితే ఇప్పుడు ఎలక్షన్ కమిషనర్ రాజీనామా పరిణామంతో ఈ ఎన్నికల షెడ్యూల్ ప్రకటనపై ప్రభావం పడుతుందా? లేక అంతా సాఫీగా సాగుతుందా? అనేది స్పష్టం కాలేదు. అయితే ఆకస్మిక రాజీనామా, అందులోనూ కీలక సమయంలో గోయల్ ఎందుకు రాజీనామా నిర్ణయానికి దిగాడనేది రాజకీయ వర్గాలకు కూడా అంతుపట్టని విషయం అయింది.

## సంపాదకీయం

# బ్యాంకు విప్పని గుట్టు

రాజకీయ పార్టీలకు ఎన్నికల బాండ్ల రూపంలో గుప్తనిధులను సమకూర్చిపెట్టే విధానానికి ఏకైక వ్యవహర్తగా, కర్తగా ఉన్న స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా సోమవారం సుప్రీంకోర్టుకు పెద్ద షాక్ ఇచ్చింది. ఎన్నికల బాండ్లు. రాజకీయ పార్టీలకు ఎన్నికల బాండ్ల రూపంలో గుప్తనిధులను సమకూర్చిపెట్టే విధానానికి ఏకైక వ్యవహర్తగా, కర్తగా ఉన్న స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా సోమవారం సుప్రీంకోర్టుకు పెద్ద షాక్ ఇచ్చింది. ఎన్నికల బాండ్లు రాజ్యాంగవ్యతిరేకం అంటూ ఫిబ్రవరి 14న ఆ విధానాన్ని కొట్టివేసి, వాటి అమ్మకాలను నిలిపివేసిన సుప్రీంకోర్టు, గత నాలుగేళ్ళలో అమ్మినబాండ్లు, వాటిని కొన్నవారి సమస్త సమాచారాన్ని ఎన్నికల సంఘానికి మార్చి 6వ తేదీలోగా బ్యాంక్ అందించాలనీ, ఈసీ ఆ వివరాలను మార్చి 13లోగా బహిర్గతపరచాలనీ ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ తీర్పు వెలువడిన మూడు వారాలకు, గడువుకు కేవలం రెండు రోజుల ముందు, ఈ ప్రక్రియ అత్యంత సంక్లిష్టమైనదనీ జూన్ 30 వరకూ గడువు పెంచాలనీ సుప్రీంకోర్టుకు ఎస్‌బీఐ విన్నవించుకుంది. సార్వత్రిక ఎన్నికల్లోగా ఈ బాండ్ల సంగతి తేల్చి, గోప్యతను ఛేదించి, సమస్త వివరాలను ప్రజలకు అందించాలని సుప్రీంకోర్టు సంకల్పిస్తే, ఎస్‌బీఐ ఇప్పుడు ఆ సదాశయాన్ని వమ్ముచేయడానికి ప్రయత్నిస్తున్నది. కోర్టు ఆదేశాలకు కట్టుబడి ఉన్నానని అంటూనే ఎన్నికలు ముగిసేవరకూ రహస్యాన్ని దాచాలనుకుంటోంది. సుప్రీం తీర్పును వమ్ముచేయకండి, అడ్డదారులు తొక్కకండి అని విపక్షపార్టీ నేతలతో సహా న్యాయకోవిదులు, మేధావులు అప్పట్లోనే ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. మోదీ ప్రభుత్వం ఆర్డినెన్సుతో తీర్పును వమ్ముచేయవచ్చునని కొందరు అనుమానించారు. ఇప్పుడు బ్యాంకును అడ్డుపెట్టుకొని మోదీ ప్రభుత్వం కొత్త కుట్రలకు తెరదీసిందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. రోజూ లక్షలాది లావాదేవీలు నిర్వహించే భారతదేశపు అతిపెద్ద బ్యాంకుకు 22వేల ఎన్నికల బాండ్ల వివరాలను కోర్టుకు ఇవ్వడానికి నిజంగానే నాలుగున్నర నెలలు అవసరమా? దేశాన్ని డిజిటల్ ఇండియాగా మార్చేసిన తరువాత కూడా ఈ కాస్తంత సమాచారానికే నెలలకొద్దీ సమయం అడుగుతూ ఎస్‌బీఐ డైరెక్టర్లు ప్రధానిని అవమానిస్తున్నారని, వారిని శిక్షించాలని శివసేన నాయకుడు సంజయ్ రౌత్ చేసిన వ్యాఖ్యలో కాస్తంత వెటకారం ఉన్నా, సరైనదే. ఎన్నికల బాండ్ల విధానంలోనే తీవ్రమైన సంక్లిష్టత, గోప్యత, దాతలు వివరాలు దాచడం అంతర్లీనమైన విలువలు కనుక, బ్యాంకు తదనుగుణంగానే వాటిని కంప్యూటర్‌లో దాచకుండా, పాలకులకు ప్రీతిపాత్రమైన సీల్డ్ కవర్ మార్గాన్నే అనుసరించింది. బాండు కొన్నవారి వివరాలు ఒక సీల్డు కవరులో, రాజకీయపార్టీలు నగదుగా మార్చుకుంటున్న సందర్భంలో ఆ వ్యవహారం వివరాలు మరో సీల్డుకవర్‌లో వేర్వేరుగా ఉంచి, వాటిని ఒకదానితో ఒకటి సరిపోల్చి అతుకువేయడానికి తనకు మరింత సమయం కావాలని అడుగుతోంది. బాండ్ల సంఖ్య వంటి అతికొన్ని వివరాలు డిజిటల్ రూపంలో, కొనుగోలుదారు పేరు, కెవైసీ ఇత్యాది కీలకమైన వివరాలు ఫిజికల్‌గా రికార్డు అయివున్నందున పనిచక్కబెట్టడం సులభం కాదని అంటోంది. దశాబ్దాల క్రితమే బ్యాంకులు రాతకోతలు వదిలేసి, కంప్యూటర్ల వాడకం ఆరంభిస్తే, డిజిటల్ లావాదేవీల్లో అగ్రస్థానంలో ఉన్న ఓ అతిపెద్ద బ్యాంకు ఎన్నికల బాండ్ల లావాదేవీలకు మాత్రం కాగితాలనే వాడటం ఆశ్చర్యం. దేశంలో ఒకచోట ఒక కార్పొరేట్ కంపెనీ ఈ బాండ్లు కొంటే, రాజకీయ పార్టీలు వేరొకచోట నగదుగా మార్చుకుంటే, వాటిని అమ్మిన, స్వీకరించిన బ్రాంచ్‌లన్నీ ఆ వివరాలన్నీ కాగితాలమీద రాయడం, సీల్డు కవర్లలో దాచడం విచిత్రమైన విన్యాసం. తద్వారా, ఒక దాత పదికోట్ల రూపాయల బాండ్లు కొంటే, అతడి చేతికి కోటి విలువైన బాండ్లు పది ఇస్తే పది కవర్లు తయారవుతాయి. వాటిని వేర్వేరు బ్రాంచ్‌లలో వేర్వేరు పార్టీలు నగదుగా మార్చుకున్నప్పుడు మరిన్ని సీల్డు కవర్లు తయారవుతాయి. నాలుగేళ్ళలో అమ్మిన బాండ్ల సంఖ్య 22వేలు కావచ్చుకానీ, కంప్యూటర్‌లను వాడకుండా, సీల్డు కవర్లను మాత్రం అధికంగా తయారుచేసి బ్యాంకు పాలకుల ఆశయాన్ని చక్కగా నెరవేర్చింది. ఇక, దేశవ్యాప్తంగా 29 బ్రాంచ్‌లలో బాండ్ల లావాదేవీలు ఎన్ని జరిగినా, సీల్డు కవర్లన్నీ ముంబైలోని ప్రధాన కార్యాలయానికే చేరినందున వాటిని సరిపోల్చడానికీ, జతచేయడానికీ నిజంగానే అన్ని నెలలు పడుతుందా? దాతల, స్వీకర్తల వివరాలను గుదిగుచ్చి, రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూండమని 2019లోనే సుప్రీంకోర్టు చెప్పిన నేపథ్యంలో, బ్యాంకు ఆ ఆదేశాలను ఉల్లంఘించి అయినా ఉండాలి, ఇప్పుడు కోర్టుకు అబద్ధమైనా చెప్పివుండాలి. బ్యాంకు అభ్యర్థన వెనుక రాజకీయ పెద్దల ప్రమేయం ఉన్నదా లేదా అన్నది అనవసరం. కానీ, తన ఆదేశాన్ని బేఖాతరుచేసి, సదాశయాన్ని వమ్ము చేయడానికి ప్రయత్నిస్తున్న బ్యాంకును ఓ నాలుగు చీవాట్లు పెట్టి, చివరకు దాని ఒత్తిడికే లొంగిపోవడం కాక, సుప్రీంకోర్టు తీవ్రంగా, భిన్నంగా వ్యవహరించడం అవసరం.

# 306.12 కోట్ల బ్యాంకు రుణాలను మహిళలకు అందజేత

- ఈ నెల 11వ తేదీన ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం
- లక్షాధికారులుగా ఉన్న మహిళలను కోటీశ్వరులను చేస్తాం. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో ఈనెల 12వ తేదీన లక్ష మంది మహిళలతో సమావేశం
- మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు ఆర్టీసీలో 24 కోట్ల మంది మహిళ లకు ఉచిత ప్రయాణం అందించాం
- ఐదు లక్షల రూపాయలు ఉన్న రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని 10 లక్షల రూపాయలకు పెంచి పేదలకు భరోసా కల్పించాం
- గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల లోపు విద్యుత్ కు జీరో బిల్లును అందిస్తున్నాం
- మహిళలకు 1200 రూపాయలు ఉన్న సిలిండర్ని కేవలం 500 రూపాయలకే అందిస్తున్నాం








**జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) :** బ్యాంకులు మహిళలకు రుణాలు ఇవ్వడం ఒకప్పటి మాటని నేడు మహిళలే బ్యాంకులకు రుణాలు ఇచ్చే స్థాయికి ఎదిగారని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, మేడ్చల్ మండలం కండ్లకోయ లో జాతీయ రహదారి 44 పై పారడైజ్ జంక్షన్ నుంచి బోయిన్పల్లి మీదుగా ఎలివేటెడ్ డబుల్ డెక్కర్ కరిడార్ నిర్మాణం గాను రూ. 1580 కోట్లతో చేపట్టనున్న ఎలివేటెడ్ డబుల్ డెక్కర్ కారిడార్ కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటుచేసిన 7 స్టాల్స్ సందర్శించి తయారు చేసిన ఉత్పత్తుల పై మహిళలను అడిగి తెలుసుకున్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలతో ముఖ్యమంత్రి ముఖాముఖిగా మాట్లాడుతూ వారు సాధించిన విజయాలను ప్రత్యక్షంగా వారిని అడిగి తెలుసుకున్నారు. మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసే దిశగా జీరో వడ్డీ రుణాలను అందిస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్ళను ఆడబిడ్డల పేరు మీదే ఇవ్వడం జరుగుతుందన్నారు. ఏప్రిల్ నుండి విజయ డైరీ పాల విక్రయ ఖాతాదారులకు నాలుగు శాతం అందించే బోనస్ ను అందించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. లక్షాధికారులుగా ప్రగతి పదంలో దూసుకుపోతున్న మహిళలను కోటీశ్వరులుగా చేస్తామన్నారు. విద్యుత్ సబ్ స్టేషన్లలో స్థానికంగా సోలార్ ప్లాంట్స్ ఏర్పాటు చేసేలా స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహిస్తామన్నారు. ఈనెల 12వ తేదీన సాయంత్రం సికింద్రాబాద్లోని పెరేడ్ గ్రౌండ్స్ లో లక్షమంది మహిళలతో సమాజానికి మహిళా శక్తి ని చాటే దిశగా సమావేశం ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ సందర్భంగా 306.12 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలను స్వయం సహాయక సంఘాల మహిళలకు చెక్కు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు, ఐటీ, శాసనసభ వ్యవహారాలు శాఖామంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు, బీసీ సంక్షేమం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి సలహాదారులు వేమ్ నరేందర్ రెడ్డి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ దివ్య దేవరాజన్ ప్రిన్సిపల్ సెక్రటరీ టు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ దాన కిషోర్ జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ హెచ్ఎండిఏ జాయింట్ సెక్రెటరీ ఆమ్రపాలి జడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రు, అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, ఎమ్మెల్యేలు ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండుగగా శివపార్వతుల కళ్యాణ వేడుక



**శామీర్ పేట, (గరుడ వార్త) :** మహాశివరాత్రి పురస్కరించుకొని మండలంలోని శివాలయాలలో శివపార్వతుల కళ్యాణం అంగరంగ వైభవంగా భక్తుల కోలాహలం మధ్య నిర్వహించారు. శుక్రవారం రాత్రి మండల కేంద్రం శామీర్ పేట శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు గడియారం మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో వేద పండితులం మంత్రోశ్చరణల మధ్య భక్తుల కోలాహలం తో శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి కళ్యాణం ఆనందోత్సవాల మధ్య నిర్వహించారు. మధ్యరాత్రి లింగోద్భవ కాలంలో స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. జాగరణ లో భాగంగా జవహర్ నగర్ కు చెందిన హరిహర భక్త భజన మండలి ఆధ్వర్యంలో సదాచారి ఆలపించిన భజన గీతాలు భక్తులను ఆకట్టుకున్నాయి. శనివారం తెల్లవారుజామున స్వామివారికి మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ చేశారు. అలాగే తూముకుంట లోని శ్రీ గాయత్రి మాక్షేత్రంలో ఆలయ వ్యవస్థాపకులు డాక్టర్ ఎస్ వి ఎల్ ఎన్ మూర్తి ఆధ్వర్యంలో ఉ మామహేశ్వర స్వామి కళ్యాణం జరిపారు. శనివారం మండల కేంద్రం శామీర్ పేట లో దాతల సహకారంతో ఘనంగా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అలాగే మండలంలోని అలియాబాద్ లో కంఠం కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. లాల్ గడి మలక్ పేటలోని ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో మహాశివరాత్రి పురస్కరించుకొని అన్నదానం చేపట్టారు. మూడు చింతలపల్లి మండలం లక్ష్మాపూర్ గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా అన్నదానం చేపట్టగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

## సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపిన హకీంపేట ఆర్టీసీ ఉద్యోగులు



**శామీర్ పేట, (గరుడ వార్త) :** హకింపేట ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు సీఎం రేవంత్ రెడ్డి కి ధన్యవాదాలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. శామీర్ పేట మండలం హకీం పేటలోని ఆర్టీసీ డిపోలో శనివారం మధ్యాహ్న సమయంలో నినాదాలు చేస్తూ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హకీం పేట డిపో టీఎంయూ కార్యదర్శి గోపు శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్న మాటను నిలబెట్టుకున్నారని చెప్పారు. గత కొన్ని సంవత్సరాలుగా ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న 50 శాతం బాండ్ డబ్బులు, 2017 పిఆర్సి 21 శాతం ఇచ్చి మా కళను నెరవేర్చారని ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే ఎంపీ ఎలక్షన్ల అనంతరం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, 2021 వేతన సవరణ జరపాలని టీఎంయూ రాష్ట్ర నాయకులు థామస్ రెడ్డి, ఏ ఆర్ రెడ్డి, కమలాకర్ గౌడ్ లకు గోపు శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## అలియాబాద్ శివాలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఆనందాన్నిచ్చింది కమటం కృష్ణారెడ్డి



**శామీర్ పేట (గరుడ వార్త):** శామీర్ పేట మండలంలోని అలియబద్ గ్రామంలో శివాలయంలో శివరాత్రి పండుగ పురస్కరించుకొని శనివారం జిల్ల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, గ్రామ మాజీ సర్పంచ్ కంఠం కృష్ణారెడ్డి అన్న ప్రసాద వితరణ కార్యక్రమ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తన వంతు సహాయంగా స్వామివారికి సేవ చేసుకుంటానని తెలియజేశారు. మహాశివరాత్రి పండుగ పర్వదినాన భక్తులకు అన్నదాన వితరణ కార్యక్రమం చేసే అవకాశం రావడం పూర్వజన్మల సుకృతమని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ఉపవాస పూర్తి చేసుకోగానే, ఉదయం తెల్లవారు జామున ఏడు గంటల నుండి అన్న ప్రసాద వితరణ చేయటం ఆనందం వ్యక్తం చేశారు.

## మళ్లీ తెరుచుకున్న రామేశ్వరం కేఫ్.. భద్రత కట్టుదిట్టం

బెంగళూరు : కర్ణాటక రాజధాని బెంగళూరు వైట్‌ఫీల్డ్ ఏరియాలోని రామేశ్వరం కేఫ్ మళ్లీ తెరుచుకుంది. కేఫ్ వద్ద భద్రత కట్టుదిట్టం చేశారు. కేఫ్‌కు వచ్చే ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే అనుమతిస్తున్నారు. కేఫ్ గేట్ వద్ద మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేశారు. రామేశ్వరం కేఫ్‌లో మార్చి 1వ తేదీన మధ్యాహ్నం బాంబు బ్లాస్ట్ జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 9 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. ఇక బాంబు బ్లాస్ట్‌కు కారణమైన యువకుడి ఆచూకీ తెలుసుకునేందుకు పోలీసులు చర్యలు ముమ్మరం చేశారు. నిందితుడి ఆచూకీ తెలిపిన వారికి రూ. 10 లక్షల రివార్డు కూడా ఇస్తామని పోలీసులు ప్రకటించారు. బాంబు బ్లాస్ట్ జరిగిన రోజు అతను క్యాప్, ముఖానికి మాస్కు ధరించినట్లు సీసీటీవీ కెమెరాల్లో రికార్డు అయింది. నిందితుడికి సంబంధించిన పలు చిత్రాలను పోలీసులు విడుదల చేశారు.

# సుప్రీం తీర్పుతో వ్యవస్థలు మారేనా...?




ఈ దేశంలో వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం కలిగించడం గురించి ప్రధానమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి మాట్లాడడం చెప్పుకోదగ్గ విషయమే. చట్టసభల్లో ఓటు వేసేందుకు, ప్రసంగించేందుకు ఎంపీలు, ఎమ్మెల్యేలు ముడుపులు తీసుకుంటే వారిపై అవినీతి నిరోధక చట్టం క్రింద చర్యలు తీసుకోవాల్సిందేనని సుప్రీంకోర్టు సోమవారం వెలువరించిన తీర్పు వెలువడిన క్షణాల్లోనే ప్రధానమంత్రి నరేంద్రమోదీ హర్షం ప్రకటించారు. ఈ తీర్పు రాజకీయాలను అవినీతి నుంచి ప్రక్షాళనం చేసేందుకు, వ్యవస్థలపై ప్రజలకు ప్రగాఢమైన నమ్మకాన్ని కలుగచేసేందుకు దారితీస్తుందని మోదీ అన్నారు. చట్టసభల్లో ఓటింగ్ చేసేందుకు సభ్యులు ముడుపులు తీసుకునే విషయంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వెనుక మూడు దశాబ్దాల చరిత్ర ఉన్నది. 1993 జూలైలో పీవీ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు వామపక్షాలకు బీజేపీ కూడా మద్దతు నిచ్చింది. తమ మధ్య సైద్ధాంతిక విభేదాలు వారి లక్ష్యానికి అడ్డు రాలేదు. ప్రధానమంత్రి కావాలన్న ఆకాంక్షతో ఉన్న కాంగ్రెస్ నేత అర్జున్ సింగ్‌తో పాటు పలువురు పీవీ ప్రభుత్వం పడిపోయేందుకు తెరవెనుక తమ వంతు ప్రయత్నాలు చేశారు. అంతర్గత, బహిర్గత ప్రత్యర్థుల మధ్య చివరకు అవిశ్వాస తీర్మానం వీగిపోయి పీవీ ప్రభుత్వం 14 ఓట్లతో గట్టెక్కింది. జనతాదళ్ నుంచి రాంలఖన్ యాదవ్ నేతృత్వంలో విడిపోయిన ఏడుగురు సభ్యులతో పాటు నలుగురు జేఎంఎం సభ్యులు మద్దతు నిచ్చారు. ములాయం వర్గానికి చెందిన ముగ్గురు ఎంపీలు, బిఎస్‌పికి చెందిన ముగ్గురు ఎంపీలు గైరుహాజరయ్యారు. జనతాదళ్ (ఏ) నేత అజిత్‌సింగ్ ఓటింగ్‌లో పాల్గొనలేదు. అజిత్‌సింగ్‌కు ఆ తర్వాత మంత్రిపదవి దక్కింది. నిజానికి జేఎంఎం సభ్యులు ఓటు వేయకపోయినా పీవీ ప్రభుత్వం గట్టెక్కేది. ఎందుకంటే, ములాయంసింగ్ యాదవ్, లాలూప్రసాద్ యాదవ్‌లతో పాటు కాన్షీరామ్ కూడా పీవీకి మద్దతు నిచ్చారు. ఈ అవిశ్వాస తీర్మానంపై జరిగిన చర్చకు పీవీ జవాబిస్తూ జార?ండ్ ప్రాంతానికి స్వతంత్ర ప్రతిపత్తిని కల్పిస్తామని హామీ ఇవ్వడంతో జేఎంఎం సభ్యులు అవిశ్వాస తీర్మానాన్ని వ్యతిరేకించారు. పీవీ హామీతోనే వారు సరిపెట్టుకుంటే బాగుండేది కాని ప్రభుత్వాన్ని కాపాడాలనుకున్న పి.వి. శ్రేయోభిలాషుల నుంచి ముడుపులను కూడా రాబట్టినట్లు ప్రచారం జరిగింది. 'వారికి ఒక్క పైసా కూడా ఇవ్వకండి అని ప్రధానమంత్రి చెప్పినప్పటికీ మా భయం మాది' అని పీవీ శ్రేయోభిలాషి ఒకరు వెల్లడించారు. పీవీ మూడు అవిశ్వాస తీర్మానాల నుంచి గట్టెక్కారు కాని ఏ సందర్భంలోనూ ఎంపీలను ప్రలోభపెట్టినట్లు ఆరోపణలు రాలేదు. జేఎంఎం ఎంపీలు పీవీ సర్కార్‌కు మద్దతు ప్రకటించిన తర్వాత దాదాపు మూడేళ్ల పాటు ఈ విషయాన్ని పెద్దగా ఎవరూ పట్టించుకోలేదు. ఎన్నికలు సమీపిస్తుండగా, రాష్ట్రీయ ముక్తి మోర్చా అనే సంస్థకు చెందిన రవీంద్రకుమార్ పిటిషన్ దాఖలు చేయడం, పీవీ 1996 మే 24న గద్దె దిగగానే జేఎంఎం కేసులో ఎఫ్ఐఆర్ దాఖలు చేయమని సీబీఐని హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు ఆదేశించిన అయిదు నెలల్లోనే సీబీఐ ఛార్జిషీటు దాఖలు చేసి పీవీని ఏ%--%వన్ నిందితుడుగా చేర్చడం, బీజేపీలో చేరిన జేఎంఎం సభ్యుడు శైలేంద్ర మహతో తనకు పీవీ ముడుపులు చెల్లించారని ఆరోపించి అప్రూవర్‌గా మారడం వంటి పరిణామాలు వెనువెంటనే జరిగాయి. దర్యాప్తు పూర్తిగా శైలేంద్ర మహతో ప్రకటనపై ఆధారపడి జరిగినట్లు, ఆయన రకరకాల ప్రకటనలు చేసినట్లు ఆనాటి ఉదంతాలు అధ్యయనం చేసిన వారికి అర్థమవుతుంది. ఇదే అభిప్రాయంతో అప్పటి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్ఎస్ సోంధీ, పీవీని నిర్దోషిగా ప్రకటించారు. పీవీ నేరుగా ఎంపీలకు ముడుపులు ఇచ్చినట్లు ఎక్కడా రుజువులు లేవని ఆయన తన తీర్పులో ప్రకటించారు. హర్షద్ మెహతా అనే స్టాక్ బ్రోకర్ పీవీకి రూ. 1 కోటి చెల్లించినందువల్ల సీబీఐతో విచారణ జరిపించాలని జనహిత్ అనే సంస్థ సుప్రీంకోర్టుకు వెళ్లినప్పుడు కూడా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వెంకటాచలయ్య ఆ పిటిషన్‌ను కొట్టి వేశారు. సుప్రీంకోర్టును రాజకీయాలకు వేదిక చేయకూడదని ఆయన స్పష్టం చేశారు. పీవీపై వచ్చిన అనేక ఆరోపణలు, కేసుల నుంచి ఆయన నిర్దోషిగా బయటపడ్డప్పటికీ, వాటి వెనుక రాజకీయ కుతంత్రాలు ఎన్ని ఉన్నప్పటికీ, జేఎంఎం కేసులో 1998లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజకీయ అవినీతికి సంబంధించి న్యాయవ్యవస్థ తీరుతెన్నులనే ప్రశ్నార్థకం చేసిందని చెప్పక తప్పదు. అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేసిన ఎంపీలపై వచ్చిన అవినీతి నేరారోపణలపై రాజ్యాంగంలోని అధికరణ 105(2) ప్రకారం చర్యలు తీసుకోవడానికి వీలు లేదని సుప్రీంకోర్టు భావించింది. సభ్యులు పార్లమెంట్‌లో చేసిన పనులన్నీ ఈ అధికరణ క్రింద వస్తాయని ప్రముఖ న్యాయవాది పావని పరమేశ్వరరావు చేసిన వాదనను సుప్రీం మెజారిటీ బెంచ్ ఆమోదించింది. ఎంపీలు స్వేచ్ఛగా వ్యవహరించేందుకు వీలుగా రూపొందించిన ఈ అధికరణను పార్లమెంట్‌లో చేసిన ప్రసంగాలకూ, ఓటింగ్‌కూ వర్తింపచేయవచ్చు కాని ముడుపులు స్వీకరించినా, ఘోరమైన నేరాలకు పాల్పడినా వర్తింపచేయడం సరైనదేనా అన్న ప్రశ్నలకు జవాబు లేకపోవడంతో నాడు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి సవాలుగా నిలిచింది. దాదాపు 26 సంవత్సరాల తర్వాత సుప్రీంకోర్టు మళ్లీ తన తీర్పును తానే తిరగరాయడం చరిత్రాత్మకం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ఇదే ఉద్దేశంతో సుప్రీం తాజా తీర్పును స్వాగతించి ఉ ంటారు. కాని సరిగ్గా 20 రోజుల క్రితం ఇదే సుప్రీంకోర్టు ఎన్నికల బాండ్ల పేరుతో రాజకీయ పార్టీలు రహస్య విరాళాలు సేకరించడం రాజ్యాంగ వ్యతిరేకమని, అవి కూడా కార్పొరేట్ సంస్థల నుంచి ముడుపులు స్వీకరించడంతో సమానమని తీర్పు నిచ్చినప్పుడు మాత్రం ప్రధానమంత్రి ఏ మాత్రం స్పందించలేదు. బహుశా ఎన్నికల బాండ్ల విషయంలో ఉన్నత న్యాయస్థానం తీర్పుతో ఆయన ఏకీభవించడం లేదని అనుకోవాల్సి వస్తుంది. సుప్రీంకోర్టు ఆదేశించినట్లు ఎన్నికల బాండ్ల వివరాలు చెప్పేందుకు కూడా స్టేట్ బ్యాంక్ ఎన్నికలు పూర్తయ్యే వరకూ సమయం అడగడం ప్రభుత్వ పారదర్శకతపై అనేక సందేహాలకు తావునిస్తోంది. చట్టసభల్లో ముడుపులు తీసుకోవడం తప్పు అని సుప్రీంకోర్టు ప్రకటించింది కాని చట్టసభల బయట ఏ విధంగా ముడుపులు తీసుకున్నా తప్పేమి కాదని ఈ దేశంలో నేతలు భావిస్తున్నట్లు కనపడుతోంది. సుప్రీంకోర్టు ఎన్ని తీర్పులు ఇచ్చినా ఈ దేశంలో ప్రజాప్రతినిధులు తమను తాము అమ్ముకోవడం, వారిని కొనుగోలు చేయడం మాత్రం ఆగిపోవడంలేదు. ఇటీవల హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, కర్ణాటకల్లో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో పలువురు ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడి వేరే పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించారు. 'ఎన్ని ఫిరాయింపు వ్యతిరేక చట్టాలు చేసినా ఎమ్మెల్యేలు ఇలా క్రాస్ ఓటింగ్‌కు పాల్పడడం ప్రజాస్వామ్య రాజకీయాల్లో చీకటి కోణాన్ని చూపిస్తోంది. రాజకీయాల్లో నైతికత అనేది ఉంటే క్రాస్ ఓటింగ్ అనేదే జరగదు' అని మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఖురేషీ వ్యాఖ్యానించారు. రాజ్యసభలో ఏదో విధంగా మెజారిటీ సంపాదించేందుకు, హిమాచల్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరం చేసేందుకు, లోక్‌సభ ఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు బీజేపీ ఈ క్రాస్ ఓటింగ్‌కు పకడ్బందీగా వ్యూహరచన చేసి ఉండవచ్చు.

## రేవంత్ రెడ్డి బిజెపితో జతకట్టడం ఖాయం: బాల్క సుమన్



హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికల తర్వాత సీఎం రేవంత్ రెడ్డి బీజేపీతో జతకట్టడం ఖాయమనిపిస్తోందని, మోదీని రేవంత్ పెద్దన్నగా సంభోధించిన తర్వాత వారిద్దరి బంధం బలపడిందని బిఆర్ఎస్ నేత, మాజీ ఎంఎల్ఎ బాల్క సుమన్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత రేవంత్ మరో ఏక్ నాథ్ షిండే, హిమంత్ బిశ్వ శర్మ అవుతారని ఆరోపించారు. ప్రధాని మోడీ దగ్గర బిజెపి సిఎంలకు దొరకని ప్రాధాన్యత కాంగ్రెస్ సిఎం రేవంత్ రెడ్డికి దొరుకుతోందని వ్యాఖ్యానించారు. సిఎం రేవంత్ రెడ్డి బిజెపితో చెట్టాపట్టాల్ వేసుకుని తిరుగుతున్న తీరును తెలంగాణ సమాజం చర్చించుకుంటోందని అన్నారు. రేవంత్ తన గురువు చంద్రబాబుతో రెండు గంటల పాటు బేగంపేట విమానాశ్రయంలో చర్చలు జరిపారని, పార్లమెంటు ఎన్నికల తర్వాత రేవంత్‌ను బిజెపి వైపు తీసుకొస్తానని చంద్రబాబు అమిత్ షాకు హామీ ఇచ్చారని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో శనివారం బిఆర్ఎస్ నాయకులు క్రాంతి కిరణ్, నన్నపనేని నరేందర్, దేవీప్రసాద్,రాకేష్ కుమార్,గట్టు రాంచందర్ రావులతో బాల్క సుమన్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి పార్టీ పోటీ చేయకుండా కాంగ్రెస్‌కు సహకరించిందని అన్నారు. పొంగులేటి, తుమ్మల టిడిపి కార్యాలయాలకు వెళ్లి మరీ కృతజ్ఞతలు చెప్పారని గుర్తు చేశారు. రేవంత్‌కు చంద్రబాబు ఎంత చెబితే అంత అని విమర్శించారు. చంద్రబాబు సిఎంగా ఉండగా తెలంగాణలో కరువు ఉండేదని, ఇప్పుడు చంద్రబాబు శిష్యుడు రేవంత్ రెడ్డి సిఎం అయ్యాక తెలంగాణలో మళ్ళీ కరువు వచ్చిందని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి పత్రికల్లో ఇచ్చే అధికారిక ప్రకటనల్లో కూడా మార్పు వచ్చిందని, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఫోటో ప్రకటనల్లో ఇప్పటికే అదృశ్యమైందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత రేవంత్ ప్రకటనల్లో అమిత్ షా, చంద్రబాబు ఉంటారని తెలిపారు. రేవంత్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నరేంద్రమోదీ చేతిలో పెడుతున్న తీరును కాంగ్రెస్ శ్రేణులు గమనించాలని బాల్క సుమన్ కోరారు. ఇప్పటికే మున్సిపాలిటీల్లో కాంగ్రెస్, బిజెపి పార్టీలు కలిసి పని చేస్తున్నాయని, అవిశ్వాసాల్లో సహకరించుకుంటున్నాయని చెప్పారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యానే బిజెపి రేవంత్ రెడ్డితో కలిసి పని చేస్తోందని ఆరోపించారు.

## రామేశ్వరం కేఫ్ పేలుడు అనుమానితుడి తాజా ఫోటోలు విడుదల



బెంగళూరు: నగరంలోని రామేశ్వరం కేఫ్‌లో మార్చి 1న జరిగిన పేలుడు కేసు అనుమానితుడికి సంబంధించిన తాజా ఫోటోలను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) శనివారం విడుదల చేసింది. అనుమానితుడికి సంబంధించిన సమాచారం ఏదైనా ఉంటే తమను సంప్రదించాలని ఎన్ఐఎ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఈ కేసుతో సంబంధమున్నట్లు అనుమానిస్తున్న యువకుడి ఆచూకీ తెలిపితే రూ.10 లక్షల బహుమానం అందచేస్తామని మార్చి 6న ఎన్ఐఎ ప్రకటించింది. బ్రూక్‌ఫీల్డ్‌లోని రామేశ్వరం కేఫ్‌లో జరిగిన పేలుడులో కనీసం 10 మంది గాయపడ్డారు. ఐఇడి ద్వారా ఈ పేలుడు జరిగి ఉ ండవచ్చని దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. ఈ కేసును ప్రాథమికంగా దర్యాప్తు చేసిన కర్నాటక పోలీసులు పేలుడుకు ఉ ప.యోగించిన టైమర్‌ను సవాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇలా ఉండగా & రామేశ్వరం కేఫ్ పేలుడు కేసును దర్యాప్తు చేస్తున్న ఎన్ఐఎ ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయన్న అనుమాంతో అరెస్టు చేసిన నలుగురు నిందితులను జైలులో ప్రశ్నించింది. బెంగళూరులోని పరప్పన అగ్రహార జైలులో ఉన్న ముగ్గురు అనుమానితులను ప్రశ్నించేందుకు ఎన్ఐఎ కోర్టులో దరఖాస్తు చేసినట్లుఎన్ఐఎకి చెందిన ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రసన్న కుమార్ తెలిపారు. కోర్టు అనుమతితో జైలులో బళ్లారికి చెందిన సయ్యద్ సమీర్(19), ముంబైకి చెందిన అనస్ ఇక్బాల్ షేక్(23), ఢిల్లీకి చెందిన షాయన్ రహ్మాన్ అలియాస్ హుస్సేన్(26)ను ఎన్ఐఎ అధికారులు శుక్రవారం ప్రశ్నించినట్లు ఆయన తెలిపారు. అదే జైలులో ఉన్న బళ్లారికి చెందిన వస్త్ర వ్యాపారి మిన్హాజ్ అలియాస్ మొహమ్మద్ సులేమాన్(26)ను బుధవారం ఎన్ఐఎ ప్రశ్నించినట్లు ఆయన చెప్పారు. అయితే ఈ నలుగురినీ ఎన్ఐఎ అదుపులోకి తీసుకున్నట్లు వార్తలు రాగా అవి నిజం కావని, వారిని జైలులోనే ఎన్ఐఎ ప్రశ్నించిందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఉగ్ర దాడులు నిర్వహించడానికి కుట్ర వన్నారన్న అనువమానంతో 2023 డిసెంబర్ 18న ఈ నలుగురితోపాటు మరో ఐదుగురు వ్యక్తులను ఎన్ఐఎ అరెస్టు చేసింది. ఐఇడిల తయారీ కోసం ముడి పేలుడు పదార్థాలను ఉపయోగించాలని వీరంతా కుట్ర పన్నినట్లు ఎన్ఐఎ అనుమానిస్తోంది. ఈ ముఠాకు సులేమాన్ నాయకుడని ఎన్ఐఎ భావిస్తోంది.

## రహదారికి అడ్డంగా గోడ నిర్మాణం...!



**మంచిర్యాల :** జిల్లా కేంద్రంలోని పాత మం చిర్యాలలోగల పురాతన సదరు రోడ్డును కబ్జా చేసిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి దారికి అడ్డంగా గోడ నిర్మించినా అడిగేవారు కరువయ్యారు. జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల ధనదాహానికి ప్రభుత్వ, అసైన్డ్ భూములు ఆక్రమణలకు గురవుతుండగా, రహదారులను కూడా కబ్జాలు చేస్తూ అక్రమంగా విక్రయిస్తున్నారు. పాత మంచిర్యాలలోని షిరిడీ సాయి బాబా ఆలయం వెనుకాల ఉన్న అత్యంత విలువైన సదరు బాట స్థలం అర ఎకరం కబ్జాకోరుల చేతుల్లోకి వెళ్లింది. సుమారు వంద సంవత్సరాల క్రితం ప్రతీ గ్రామంలో ప్రజల అవస రాల కోసం సదరు రోడ్డు (బాటలు) ఉండేవి. సదరు రోడ్డును ముఖ్యంగా వ్యవసాయం, పశువుల తరలింపునకు ప్రజలు వినియోగించేవారు. వంట చెరుకు కోసం అడవికి వెళ్లేందుకు సదరు రోడ్డును ఉపయోగించేవారు. అలాగే గ్రామంలోని పశువులను సమీపంలోని అటవీ ప్రాంతానికి మేతకు తీసుకెళ్లేందుకు రైతులు ఈ రహదారులనే వినియోగించేవారు. అలా గ్రామ అవసరాల రీత్యా పూర్వీకులు సదరు రోడ్డులను నిర్మించారు. ప్రభు త్వ స్థలాలు అందుబాటులో లేని చోట, పట్టేదారుల నుంచి మార్కెట్ ధరకు సేకరించి, రోడ్డు నిర్మాణం చేపట్టేవారు. అలా పాత మంచిర్యాలలో కూడా పూర్వీకులు సుమారు 8 కిలోమీటర్ల మేర 40 అడుగుల వెడల్పుతో రహదారి ఏర్పాటు చేశారు. పాత మంచిర్యాలలో ఉన్న సదరు రహదారి కోసం కేటాయించిన భూముల ధర ప్రస్తుతం మార్కెట్ విలువ ప్రకారం ఎకరా రూ.4 కోట్ల వరకు పలుకుతోంది. రహదారి నివాస గృహాలను ఆనుకొని ఉండటంతో కాలక్రమేణ కబ్జాదారుల కళ్లు దారిపై పడ్డాయి. ఏడెనిమిది సంవత్సరాల క్రితం రహదారిని అడ్డంగా సిమెంట్ స్తంభాలు పాతిన కొందరు దాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించారు.

## ఉపాధిహామీ ఉద్యోగులకు అందని వేతనాలు



- నాలుగు నెలలుగా పెండింగ్
- నిత్యావసరాలు సైతం కొనలేని దైన్యం
- అప్పులపాలవుతున్న కుటుంబాలు
- ఆదుకోవాలని సర్కారుకు విన్నపం

**కొడకండ్ల :** పల్లెల నుంచి పట్టణాలకు వలసలను తగ్గించాలన్న ఉద్దేశంతో 2005లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహాత్మ గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకాన్ని ప్రారంభించింది. దీని కింద అనేక రకాల పనుల ద్వారా కూలీలకు పని దొరకడమేకాక పల్లెల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటవుతున్నాయి. అయితే గ్రామాల్లో కూలీలకు ఉపాధి కల్పించడానికి విశేషకృషి చేస్తున్న ఉద్యోగులు, కిందిస్థాయి సిబ్బంది బతుకులు మాత్రం దుర్భరంగా మారుతున్నాయి. మార్చి నెలతో కలిపి ఇప్పటివరకు 4 నెలల జీతం అందక ఈజీఎస్ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి కిరాయి, పిల్లల చదువులకు ఫీజుతో పాటు నిత్యావరాలకు కూడా అప్పులు చేయాల్సిన పరిస్థితిని వారు ఎదుర్కొంటున్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో అనేక రకాల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రైతువేదికల నిర్మాణం, కల్లాలు, ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, నర్సరీలు, ఫాంపౌండ్‌లు, ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లు, హరితహారం, ఎవెన్యూ ప్లాంటేషన్, పశువుల షెడ్లు, సీసీ రోడ్లు, గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్వాడీ భవనాలు, వంటగదుల నిర్మాణం, మురుగు కాల్వల, గ్రామీణ క్రీడాప్రాంగణాల నిర్మాణం ఇలా సుమారు 40 రకాలకు పైగా పనులు ఈ పథకంలో కొనసాగుతున్నాయి. ప్రతీ పనిలో కిందిస్థాయి సిబ్బంది నుంచి జిల్లాస్థాయి అధికారుల వరకు శ్రమించాల్సిందే. ప్రతీపనికి ముందస్తు ప్రణాళికలు, లక్ష్యాలు తయారు చేయడం, అమలు చేయడం, ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయడం వంటివి పూర్తయితేనే కూలీలకు సరైన సమయంలో డబ్బులు అందుతాయి. గత ప్రభుత్వ హయాంలో కొత్త గ్రామపంచాయతీలు ఏర్పడ్డా కూడా కొత్తసిబ్బందిని నియమించకపోవడంతో ఉన్న వారిపైనే పడింది. జనగామ జిల్లాలో సహాయ ప్రాజెక్ట్ అధికారులు 8 మంది, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు 8, సాంకేతిక సహాయకులు 39, కంప్యూటర్ ఆపరేటర్లు కమ్ అక్కౌంటెంట్లు 13, క్షేత్ర సహాయకులు 171 మంది విధులు నిర్వహిస్తున్నారు. క్షేత్రసహాయకులు ప్రతీ గ్రామానికొకరు అవసరం ఉన్నా ప్రస్తుతం ఒక్కొక్కరు 3, 4 గ్రామాలు చూసుకుంటున్నారు.

# నేటి మహిళకు సవాళ్ళు-పరిష్కారాలు

1908లో న్యూయార్క్ నగర వీధుల్లో తమ హక్కుల సాధన కోసం వేలాది మంది మహిళా కార్మికులు నిర్వహించిన వీరోచిత పోరాటానికి గుర్తుగా మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రకటించారు. సుమారు 15 వేల మంది మహిళలు, మహిళా హక్కుల ఉద్యమనేత క్లారా జెట్కిన్ నేతృత్వంలో ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. దీంతో పాటు మహిళలు ఓటు వేయాలనే డిమాండ్‌ను కూడా ఇందులో చేర్చారు. కఠినమైన పని పరిస్థితులు, ఎక్కువ పని గంటలు, తక్కువ వేతనాలకు వ్యతిరేకంగా ఈనిరసన సాగింది. ఆ మహిళల జ్ఞాపకార్థం 1909 ఫిబ్రవరి 28న అమెరికాలో తొలిసారిగా మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. 1909లో సోషలిస్ట్ పార్టీ ఆఫ్ అమెరికా మహిళా దినోత్సవాన్ని జరుపుకోవాలని ప్రకటించింది. 1917లో మొదటి ప్రపంచ యుద్ధంలో రష్యా మహిళలు శాంతి ఉద్యమం చేపట్టారు. దీంతో రష్యా చక్రవర్తి నికోలస్ తన పదవికి రాజీనామా చేశాడు. తర్వాత మహిళలకు ఓటు హక్కు కూడా లభించింది. ఈ నేపథ్యంలోనే యూరోప్ మహిళలు మార్చి 8న శాంతి కార్యకర్తలకు మద్దతుగా ర్యాలీలు చేపట్టారు. ఈ ఉద్యమాల ఫలితంగానే 1975లో ఐక్యరాజ్యసమితి మార్చి 8ని అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించింది. లింగ సమానత్వం, సమాజంలో మహిళల పాత్ర, మహిళలపై వేధింపులు, మహిళలకు సమాన హక్కులు వంటి వాటిపై అవగాహన కల్పించడమే అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రధాన ఉద్దేశం. అయితే ఇన్‌స్పైర్ ఇన్‌క్లూజన్ అనే థీమ్‌తో అంతర్జాతీయ మహిళా దినోత్సవం- 2024ను నిర్వహించుకుంటున్నాం. లింగ సమానత్వం ప్రాథమిక మానవ హక్కు మాత్రమే కాదు అది శాంతియుత, సుసంపన్న, సుస్థిరాభివృద్ధితో కూడిన ప్రపంచానికి అత్యవసరమైన పునాది అని ఐక్యరాజ్యసమితి తన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో పేర్కొన్నది. ఈ దిశగా ప్రపంచం కొంత పురోగతి సాధించినప్పటికీ చేరుకోవాల్సిన తీరాలు ఇంకా ఎన్నో ఉన్నాయి. బాల్యవివాహాలు, భారమైన ఇంటిపని, గృహ హింస, అవకాశాల్లో వివక్ష, వేతనాల్లో అసమానత, భౌతిక దాడులు, లైంగిక వేధింపులు, నిర్ణయాధికారం లేకపోవటం వంటి అనేక సమస్యలు ఇంకా మహిళల్ని పట్టిపీడిస్తూనే ఉన్నాయి. ప్రపంచ జనాభా దాదాపు 800 కోట్లు. దీంట్లో సగం మంది మహిళలే. సమాజంలోని ప్రతి నిర్మాణాత్మక రంగంలోనూ వారికి సగం ప్రాతినిధ్యం ఉండాల్సిందే. అది మహిళల అభ్యున్నతికి మాత్రమే కాదు, మొత్తంగా ప్రపంచం అభివృద్ధికి అత్యవసరం. కానీ, ఇది అనుకున్నంత సులభం కాదు. రాజ్యాధికారమే సకల సమస్యలను పరిష్కరించే ప్రధాన తాళం చెవి. దానితోనే అభివృద్ధికి సంబంధించిన అన్ని తలుపులు తెరుచుకుంటాయి అని బాబాసాహెబ్ అంబేడ్కర్ ఇచ్చిన పిలుపు దళిత, బహుజన జాతులకే కాదు మహిళలకూ వర్తిస్తుంది. విధానాలకు రూపకల్పనచేసే చట్టసభల్లో, వాటిని అమలు చేసే ప్రభుత్వాల్లో మహిళల ప్రాతినిధ్యం వారి జనాభాకు తగినట్లు పెరుగుతున్నా అవి అమలు జరపనంత కాలం వారి భవిష్యత్తును వారు నిర్మించుకోలేరు. ఇది ఇప్పటికే నిరూపితమైంది కూడా. ఎందుకంటే పాలనలో, అధికార యంత్రాంగంలో మహిళల సంఖ్య తగినంతగా ఉన్న దేశాలు, సంస్థలే నేడు మంచి పురోభివృద్ధిని సాధిస్తున్నాయి. ప్రస్తుతం మన లోక్‌సభలో మహిళల వాటా 14% మాత్రమే. సరే చట్టసభల్లో మూడోవంతు సీట్లను స్త్రీలకు కేటాయించే మహిళా రిజర్వేషన్ బిల్లు ఎన్నో ఏండ్లుగా పెండింగ్‌లో ఉండి నేడు అమల్లోకి వచ్చినా దీనికి మోక్షం దక్కేలా దేశ వ్యాప్తంగా మహిళలు పూనుకోవాలి. రాజకీయ రంగంలో పరిస్థితులు మెరుగుపడాల్సి ఉన్నప్పటికీ అంతరిక్షం నుంచి ఆరోగ్యం వరకూ అన్ని రంగాల్లో మన దేశ మహిళలు సత్తా చాటడం మంచి పరిణామం. న్యాయ, పోలీసు, రక్షణ వంటి సంప్రదాయేతర రంగాల్లోనూ వారు రాణిస్తున్నారు. అయితే స్త్రీలు అన్ని రంగాల్లో ముందుండాలి అంటే అక్షరాస్యత శాతాన్ని పెంచుకోవాలి. వరల్డ్ ఎకనామిక్ ఫోరం -2023లో 146 దేశాల లింగ సమానత్వ సూచీలో భారత దేశం 0.643 స్కోర్‌తో 127వ స్థానంలో నిలిచింది. అన్ని రంగాల్లో లింగ భేదాన్ని తొలగించడంలో భారత దేశం 64.3% ముందంజ వేసినా, పురుషుల ఆర్థిక భాగస్వామ్యంలో, ఆర్థిక అవకాశాల్లో 36.7 శాతం సాఫల్యాన్ని మాత్రమే సాధించింది. అయితే భారత దేశం లింగ సమానత్వంలో బెటర్‌గా ఉన్నప్పటికీ కొన్ని విషయాలను మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. వాటిలో మహిళా విద్య అనేది దాదాపు దశాబ్ద కాలంగా ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తించే అంశంగా ఉంది. ఎందుకంటే ఈ విషయంలో భారత దేశం బాగా వెనుకబడిఉన్నది. పురుషులతో సమానంగా చదువుకునేందుకు మహిళలకు హక్కులు ఉన్నా తరతరాలుగా వేళ్ళూనుకుపోయిన మనుధర్మ భావనల కారణంగా పురుషులే అత్యధికంగా విద్యావంతులుగా ఉంటున్నారు. రష్యా, పోలాండ్, ఉక్రెయిన్, ఉజ్బెకిస్తాన్, కజకిస్తాన్, క్యూబా, అజర్‌బైజాన్, తజికిస్తాన్, బెలారస్, కిర్గిజ్‌స్థాన్‌లు స్త్రీ పురుషుల అక్షరాస్యత రేటు 100% కలిగి ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 781 మిలియన్ల ప్రజల్లో మూడింట రెండు వంతుల మంది స్త్రీలు చదవడం లేదా వ్రాయడం రాని ఉన్నారు. తక్కువ అభివృద్ధి చెందిన దేశాల్లో అయితే పురుషులు ఉద్యోగాలు చేస్తుండగా, మహిళలు వంటింటికే పరిమితమవుతున్నారు. కాబట్టి స్త్రీలు అక్షరాస్యతలో మెరుగుపడితే, ఆర్థికపరంగా, ఉద్యోగాల్లోనూ మెరుగ్గా ఉండే అవకాశం ఉంటుంది. అప్పుడే లింగ సమానత్వానికి సరైన నిర్వచనం ఇవ్వగలం. ఈ మహిళల అక్షరాస్యతలో అసమానతను పరిష్కరించడం అనేది ఇప్పుడు అత్యంత కీలకమైనది. ఇదే స్త్రీలను శక్తిమంతంగా మార్చి సాధికారత వైపుకి అడుగులు వేయించి దేశాన్ని ప్రగతి పథంలోకి దూసుకుపోయేలా చేస్తుంది.

# పగ, ప్రతీకారాన్ని తిరస్కరించండి...: బైడెన్



**వాషింగ్టన్ :** రిపబ్లికన్ పార్టీ తరఫున అమెరికా అధ్యక్ష అభ్యర్థిత్వ రేసులో ముందున్న డొనాల్డ్ ట్రంప్ దేశానికి చాలా ప్రమాదకరమని అధ్యక్షుడు జో బైడెన్ అన్నారు. పగ, ప్రతీకారంతో బరిలోకి దిగుతున్న ఆయన్ను రాబోయే ఎన్నికల్లో తిరస్కరించాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఉభయ సభలనుద్దేశించి ఏటా చేసే 'స్టేట్ ఆఫ్ ది యూనియన్' ప్రసంగంలో గురువారం ఈ వ్యాఖ్యలు చేశారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే ఈ వార్షిక సమావేశంలో అధ్యక్షుడు తమ ప్రభుత్వ విధానాలు, ప్రాథమ్యాలు, భవిష్యత్ కార్యాచరణను ప్రజల ముందు ఉంచుతారు. కానీ, రెండోసారి అధ్యక్ష పదవి కోసం పోటీ పడుతున్న బైడెన్ తాజాగా ఈ వేదికను తన అభ్యర్థిత్వాన్ని బలపర్చుకోవడం కోసం ఉపయోగించుకున్నారు. "జీవితం నాకు స్వేచ్ఛ, ప్రజాస్వామ్యాన్ని స్వీకరించడం నేర్పింది. నిజాయతీ, మర్యాద, గౌరవం, సమానత్వం.. అమెరికాను నిర్వచించిన ఈ విలువలపైనే మన భవిష్యత్తు ఆధారపడి ఉంది. అందరినీ గౌరవించాలి. అందరికీ సమాన అవకాశాలు ఇవ్వాలి.

# కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఎంఎస్‌పికి చట్టబద్ధత



**జైపూర్ :** త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఖాళీగా ఉన్న 30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని, గ్రాడ్యుయేషన్ తరువాత యువకులకు ఒక ఏడాది అప్రెంటిస్‌షిప్‌లో రూ. లక్ష వరకూ చెల్లిస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. అన్ని పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) కల్పించేలా చట్టం తీసుకొస్తామన్నారు. భారత్ జోడో న్యాయ యాత్రలో భాగంగా రాజస్థాన్‌లోని బనస్వరా వద్ద జరిగిన ర్యాలీలో ప్రసంగిస్తూ రాహుల్ ఈ హామీలు ఇచ్చారు. యువతకు 'ఐదు న్యాయాలు' చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఖాళీలను భర్తీ చేయడం, శాశ్వత ఉద్యోగాలు, నియామక పరీక్ష పత్రాల లీక్‌లు లేకుండా చూడ్డం, గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత, 40 ఏళ్ల లోపు యువకులకు స్టార్టప్ ఫండ్ అనే వాగ్దానాలు చేశారు. అలాగే వాగ్దానాలను కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో కూడా పొందుపరుస్తామని రాహుల్ స్పష్టం చేశారు. అలాగే కుల గణన చేయాల్సిన అవసరాన్ని రాహుల్‌గాంధీ మరోసారి ప్రస్తావించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే కుల గణన చేస్తామని హామీ ఇచ్చారు. కాగా, భారత్ జోడో న్యాయ యాత్ర గురువారంతో గుజరాత్‌లోకి ప్రవేశించింది. దహొూద్ జిల్లాలోని జాలోద్ పట్టణంలోకి చేరడంతో గుజరాత్‌లోకి యాత్ర ప్రవేశించినట్లయింది. ఇక్కడ జరిగిన సభలో కూడా మాట్లాడుతూ రాహుల్ బిజెపిపై విమర్శలు గుప్పించారు.


# కోర్టు ఆదేశాలను ఎస్‌బిఐ పాటించాల్సిందే



న్యూఢిల్లీ: ఎలక్టోరల్ బాండ్ల వివరాలను వెల్లడించాలన్న సుప్రీం కోర్టు ఆదేశాలను ఎస్‌బిఐ పాటించాల్సిందేనని సిపిఎం డిమాండ్ చేసింది. పార్టీ పొలిట్‌బ్యూరో గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదలజేస్తూ, మోడీ ప్రభుత్వం ఒత్తిడికి తలొగ్గి ఎన్నికలు అయ్యేదాకా ఎలక్టోరల్ బాండ్ల వివరాలను వెల్లడించకుండా నాన్చాలని ఎస్‌బిఐ చూస్తోందని, దీనికి వ్యతిరేకంగా ఎస్‌బిఐల ఎదుట నిరసనలు తెలపాలని పొలిట్‌బ్యూరో పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చింది. ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని తీర్పు చెబుతూ, ఆ బాండ్లకు సంబంధించిన వివరాలన్నింటినీ మార్చి 6లోగా ఎన్నికల కమిషన్‌కు అందచేయాలని సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో ఎస్‌బిఐ విఫలమైంది. ఈ సమాచారాన్ని ఇవ్వడానికి ఎస్‌బిఐకి ఇచ్చిన మూడు వారాల గడువు ముగిసింది. ఆ వివరాలను వెల్లడించడానికి బదులు ఎస్‌బిఐ, గడువు ముగుస్తున్న సమయంలో మరో 116 రోజులు అదనపు గడువు కావాలని కోర్టును ఆశ్రయించింది. జూన్ 30కల్లా మొత్తంగా కోరిన సమాచారమంతా అందచేస్తామని తెలిపింది.

# భారత్‌కు జపాన్ సహజ భాగస్వామి

టోక్యో: ప్రగతి పథంలో జపాన్‌ను సహజ భాగస్వామిగా భారత్ చూస్తుందని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ అన్నారు. వ్యూహాత్మకంగా కీలకమైన ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, సుస్థిరతల విషయంలో ఇరు దేశాలు కలిసికట్టుగా ముందుకెళ్తున్నాయని పేర్కొన్నారు. టోక్యోలో గురువారం 16వ భారత్-జపాన్ విదేశీ వ్యవహారాల మంత్రుల వ్యూహాత్మక సమావేశంలో ఆయన ఈ మేరకు ప్రసంగించారు. రక్షణ, భద్రత రంగాల్లో ఇరు దేశాలు ఇప్పటికే మంచి పురోగతి సాధించాయని పేర్కొన్నారు. 2023ను భారత్, జపాన్ సంబంధాల్లో చరిత్రాత్మక సంవత్సరంగా అభివర్ణించారు. జపాన్ విదేశాంగ మంత్రి కమికవా యోకోతో భేటీలో తాను ఫలవంతమైన చర్చలు జరిపినట్లు తెలిపారు. మరోవైపు- టోక్యోలో తొలి రైసీనా రౌండ్‌టేబుల్ సమావేశంలో జైశంకర్ ప్రసంగిస్తూ.. ప్రస్తుతం ప్రపంచం బలమైన సరఫరా గొలుసులను నిర్మించుకుంటూ, పారదర్శక డిజిటల్ లావాదేవీలు జరుపుతూ పునఃప్రపంచీకరణ దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు. ఈ తరుణంలో భారత్, జపాన్ మధ్య



మైత్రి మరింత బలోపేతమవడం సహజమేనని పేర్కొన్నారు. సమకాలీన అవసరాలకు తగినట్టుగా ఐక్యరాజ్య సమితిలో సంస్కరణలు చేపట్టడం అత్యావశ్యకమని.. ఆ దిశగా దిల్లీ, టోక్యో ఐక్యంగా కృషి చేస్తున్నాయని చెప్పారు.

# అమెరికాది ఆర్థిక ఉగ్రవాదం ఆంక్షలపై ఆగ్రహించిన వెనిజులా



**కారకాస్ :** తమ దేశంపై ఆంక్షలను విధించడమే కాకుండా వాటిని పొడిగిస్తూ వస్తున్నారంటూ అమెరికాపై వెనిజులా తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. వెనిజులాకు వ్యతిరేకంగా 930కి పైగా చర్యలు తీసుకోవడం ద్వారా అమెరికా ఆర్థిక ఉగ్రవాదానికి పాల్పడుతోందని వెనిజులా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. మాజీ అధ్యక్షుడు బారక్ ఒబామా నేతృత్వంలో 2015లో జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ 13692ని పొడిగించాలని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మంగళవారం నిర్ణయించారు. వెనిజులాలో పరిస్థితికి సంబంధించి మరో ఏడాది పాటు జాతీయ అత్యవసర పరిస్థితి విధిస్తున్నట్లు ప్రకటించారు. అమెరికాకు అసాధారణమైన ముప్పును వెనిజులా కలిగిస్తోందని అన్నారు. అంతర్జాతీయ చట్టాలకు సంబంధించిన ప్రతి నిబంధనను ఉల్లంఘించి వెనిజులన్లపై ఉధృతంగా సాగిస్తున్న ప్రచారాన్ని సమర్థించేందుకు ఈ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ను ఉపయోగించుకుంటున్నారని వెనిజులా ఒక ప్రకటనలో తీవ్రంగా విమర్శించింది. బలవంతపు చర్యలు, దోపిడీ లేదా అగౌరవంపై ఆధారపడని, సమగ్రమైన విదేశాంగ విధానాన్ని రూపొందించే సామర్థ్యం అమెరికాకు లేదని విమర్శించింది. అమెరికా ఏం చేసినా దానితో నిమిత్తం లేకుండా వెనిజులా స్వేచ్ఛాయుతమైన దేశంగా కొనసాగుతుందని పేర్కొంది.

# భారత హెలికాప్టర్, సిబ్బందిపై ఇక పూర్తి నియంత్రణ మాదే



**మాలె :** క్రమంగా చైనా పంచన చేరుతున్న మాల్దీవులు భారత వ్యతిరేక వైఖరికి మరింత పదును పెడుతోంది. ఇప్పటికే తమ భూభాగం నుంచి భారత సైనికులను పంపించేయాలని నిర్ణయించగా తాజాగా మరో ముందడుగు వేసింది. భారత్ అందజేసిన హెలికాప్టర్, దాన్ని నిర్వహిస్తున్న సిబ్బందిపై పూర్తి నియంత్రణను తమ చేతుల్లోకి తీసుకుంటున్నట్లు 'మాల్దీవుల జాతీయ రక్షణ దళం గురువారం ప్రకటించింది. భారత దళాల ఉపసంహరణపై చర్చలు కొనసాగుతున్నాయని ఎంఎన్‌డీఎఫ్‌లోని 'ప్లాన్స్, పాలసీ, రీసోర్సెస్ విభాగం' డైరెక్టర్ కర్నల్ అహ్మద్ ముజుథబ మహమ్మద్ తెలిపారు. మే 10 తర్వాత మాల్దీవుల భూభాగంపై విదేశీ దళాలు ఉండొద్దని అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు ఆదేశించినట్లు గుర్తుచేశారు. మరోవైపు మాల్దీవులక అందజేసిన హెలికాప్టర్‌ను నిర్వహిస్తున్న సైనిక సిబ్బంది స్థానంలో సాధారణ పౌర నిపుణుల బృందాన్ని పంపినట్లు భారత్ గతవారం ప్రకటించిన విషయం తెలిసిందే. నిరుడు జరిగిన ఎన్నికల్లో చైనా అనుకూల ముయిజ్జు.. భారత్ అనుకూల మహమ్మద్ సోలీని ఓడించారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు భారత దళాలు తమ భూభాగం నుంచి వైదొలగాలని అధికారం చేపట్టిన కొన్ని రోజులకే ప్రకటించి వివాదానికి తెరతీశారు. మరోవైపు భారత్‌తో కుదుర్చుకున్న 100 ఒప్పందాలను సమీక్షిస్తామని ఇటీవల ప్రకటించారు. సముద్రగర్భ సర్వేలు నిర్వహించడానికి గతంలో భారత్‌తో కుదుర్చుకున్న ఒప్పందాన్ని పునరుద్ధరించబోవడం లేదని తెలిపారు.

# వర్క్‌ప్లేస్ యాంగ్జైటీస్.. అధిగమించే మార్గమిదే..

సృష్టికి మూలం మగువ అంటారు. ఆడదే తన గర్భాశయాన్ని చీల్చి మరొక బిడ్డకు జన్మను ఇస్తుంది. ఆడది లేకపోతే జగతే లేదు. కానీ, చాలా మంది మగవాళ్లు నిజంగా ఆడదాన్ని పిల్లల్నీ కనే ఒక మెషిన్‌లా చూస్తున్నారు. పెళ్లిళ్లు చేసుకుని వంటింటికే అంకితం చేస్తున్నారు. అంతే కాకుండా.. ఎంత చదివిన కూడా ఆడవాళ్లకు ఏం తెలియదు అనే చులకన భావంతో చూస్తూ వారిని ముందడుగు వెయ్యకుండా వంటింటి కుందేళ్లుగా పరిమితం చేస్తున్నారు. ప్రస్తుతం సమాజంలో ఇలాంటి వారి మగఅహంకారాన్ని ఎదురించడానికి చాలా మంది ఆడవాళ్లు ఉద్యోగాలు చేస్తున్నారు. మేము కూడా తెలివైన వాళ్లమే.. మాకు సాధ్యం కానికి ఏది ఉండదు అని నిరూపించుకోవడమే కాకుండా ఎదుగుదలలో, తెలివిలో మగాళ్లకు ఓ మెట్టు పైనే ఉంటున్నారు మహిళలు. దీనిని జీర్ణించుకోలేని కొంత మంది పురుషులు అక్కడ కూడా వాళ్లను ఆందోళనకు గురిచేస్తున్నారు. ఈ రోజుల్లో మహిళలు, పురుషులు అనే తేడా లేకుండా అందరూ ఉద్యోగాలు చేస్తున్నారు. అయితే.. వర్క్ ప్లేస్‌లో పని భారం, ఒత్తిడి పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఫేస్ చేస్తుంటారు. ఎందుకంటే.. పురుషులతో పోల్చుకుంటే మహిళలకు ఇంటి బాధ్యతలు కూడా అదనంగా ఉంటాయి. ప్రత్యేకించి వారు తమ డ్యూటీ టైమ్స్‌లో, ఎక్కువ పనిభారాన్ని కలిగి ఉన్నప్పుడు ఆఫీసులో ఆందోళన చెందడం, మానసికంగా ఎంతో టెన్షన్‌కు గురవ్వడం సాధారణం. ఇక కొన్నిసార్లు వర్క్‌ప్లేస్‌లో ఆందోళన అనేది పనిలో అన్యాయంగా వ్యవహరించే మేనేజర్ల వల్ల కూడా వస్తుంది. కొంత మంది పురుషులు అహంకారం చేత కూడా మహిళలు అణగదొక్కబడవచ్చు. ఈ కారణాలు మహిళల ఆత్మగౌరవాన్ని, మానసిక ఆరోగ్యాన్ని బాగా ప్రభావితం చేస్తాయి. ఇది కార్యాలయంలో ఆందోళనగా వ్యక్తమవుతుంది. అయితే, వర్క్‌ప్లేస్ యాంగ్జైటీని అధిగమించడానికి శ్రామిక మహిళలు కొన్ని చిట్కాలు పాటిస్తే ఆందోళ తగ్గించడంలో ఉపయోగపడతాయి. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం..

1. సెల్ఫ్ కేర్: ప్రతి మహిళ ఆఫీసులో, ఇంట్లో ఎక్కడైన సరే ఒత్తిడిని తట్టుకోవాలంటే మొదట స్వీయ సంరక్షణ (సెల్ఫ్ కేర్) కు ప్రాధాన్యతను ఇవ్వడం చాలా అవసరం. దీని కోసం రోజు వ్యాయామం, తగినంత నిద్ర, అలాగే కొంచెం సేపు విశ్రాంతి తీసుకోవడం ముఖ్యం. ఇవన్ని మహిళలు తమ రోజు లైఫ్‌లో యాడ్ చేసుకున్నట్లయితే.. ఒత్తిడి, ఆందోళనను క్రమంగా తగ్గిస్తాయి. ఎందుకంటే మహిళలు ఆరోగ్యంగా ఉండే ఇంటి బాధ్యతను, ఆఫీసులో వర్క్ టెన్షన్‌ను ఈజీగా హ్యాండిల్ చెయ్యగలుగుతారు.

2. టైం మెనేజ్మెంట్: మహిళలకు టైం మెనేజ్మెంట్ అనేది చాలా అవసరం. మనం సమయ నిర్వహణ నైపుణ్యాలను సక్రమంగా చేసుకోగలిగితే ఒత్తిడిని తగ్గింస్తుంది. ఏ పనిని ఏ టైంలో చెయ్యాలో ముందుగానే ఓ ప్రణాలికను సిద్ధం చేసుకోండి. ఆ టైంకి ఆ పనులకు ప్రాధాన్యత ఇవ్వండి. ఈ కారణంగా ఏదైనా పెద్ద ప్రాజెక్టులు అయిన సులభంగా ఫినిష్ చెయ్యగలుతారు. అలా చక్కటి టైం టేబుల్‌ను రూపొందించడం వలన పని చేసే మహిళలు సమయాన్ని సమర్ధవంతంగా కేటాయించుకోగలుగుతారు. దీంతో పాటు పని ఒత్తిడి కూడా తగ్గుతుంది.

3. బౌండరీస్: ఆరోగ్యకరమైన పని-జీవిత సమతుల్యతను కాపాడుకోవడానికి సరిహద్దులను నిర్ణయించుకోవడం చాలా అవసరం. ముఖ్యంగా మీ పనిని తక్కువగా అంచనా వేసే లేదా మిమ్మల్ని దూకుడు ప్రవర్తనకు గురిచేసే మేనేజర్‌తో వ్యవహరించేటప్పుడు సరిహద్దులను గీయడం, వారి దగ్గర స్ట్రాంగ్‌గా వ్యవహరించడం చాలా ముఖ్యం. అంతే కాకుండా మీ పని గంటలు, వ్యక్తిగత కట్టుబాట్లకు సంబంధించిన విషయాల గురించి మీ సహోద్యోగులు, ఉన్నతాధికారులతో స్పష్టంగా తెలియజేయండి.

4. స్ట్రాంగ్ సపోర్ట్: ఆఫీసుల్లో ఆందోళనను అధిగమించడానికి మనకు సపోర్ట్ చాలా అవసరం.



మిమ్మల్నీ, మీ ప్రయత్నాలను అర్థం చేసుకుని అభినందించే సహోద్యోగులు, సలహాదారులు, స్నేహితులతో మాట్లాడండి. అనుభవాలను పంచుకోవడం, సలహాలు కోరడం వంటివి ఇతరుల నుండి సపోర్ట్‌ను, స్నేహన్ని పొందడానికి ఉపయోగపడతాయి. అంతే కాకుండా ఏదైన ఒత్తిడిలో ఉన్నప్పుడు అలాంటి వారితో మాట్లాడటం కారణంగా ఆఫీసులో ఆందోళనను దూరం చేసి మిమ్మల్నీ సంతోషంగా ఉంచుతాయి.

5. బీ పాజిటివ్: వృత్తి విషయంలో ఆందోళనలు, ఒత్తిడిలు ఎదురవుతుంటాయి. కొన్ని కొన్ని సార్లు టెన్షన్‌ను తట్టుకోలేక పోతారు. అలాంటి సమాయాల్లో పాజిటివ్‌గా ఆలోచించగలగాలి. మీరు అనుకున్న ఒక పాయింట్ స్ట్రాంగ్‌గా కమ్యూనికేట్ చేయగలిగాలి. అంతే కాదు మన గురించి ఎవరైనా ఏదైన అనుకుంటారా అని చాలా మంది మహిళలు మాట్లాడటానికి కూడా వెనకడుగు వేస్తారు. అలా కాకుండా మనం ఏదైతే అనుకున్నామో దాన్ని స్ట్రాంగ్‌గా చెప్పగలిగితే.. అపార్థాలు తగ్గడమే కాకుండా వృత్తిపరమైన అనుభవాన్ని కూడా మెరుగుపరుస్తుంది.


6. యాక్టివ్: మీ ఫీల్డ్‌కు సంబంధించిన కొత్త విషయాలను నేర్చుకోడంలో, జ్ఞానాన్ని పొందడంలో యాక్టీవ్‌గా ఉండండి. నిరంతర అభ్యానం వృత్తివరమైన సామర్థ్యాన్ని పెంపొందించడవే కాకుండా విశ్వాసాన్ని కూడా పెంచుతుంది. బాగా సిద్ధమైనట్లు, సమర్థత కలిగి ఉన్నట్లు భావించడం వలన ఆఫీసులో ఒత్తిడి, ఆందోళనను తగ్గించవచ్చు. వీటితో పాటు వర్కింగ్ మైండ్‌సెట్‌తో సవాళ్లను స్వీకరించడానికి శ్రామిక మహిళలను శక్తివంతం చేయవచ్చు.

# కూరగాయల్లో ఆరోగ్యకరమైనవి....



భారతదేశంలో ఎక్కువ మంది ప్రజలు శాకాహారాన్ని ఇష్టపడతారు. ఈ శాకాహారంలో అనేక రకాల కూరగాయలు ఉన్నాయి. శాకాహారంలో అనేక రకాల విటమిన్లు, పోషకాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇది మనిషిని ఆరోగ్యంగా ఉంచడంలో ఎంతగానో సహాయపడుతుంది. వాస్తవానికి కూరగాయలు తింటే అలర్జీ లేకపోతే శాకాహారం తీసుకోవడమే బెటర్ అంటున్నారు నిపుణులు. మనం ప్రతి వెజిటేబుల్ ను పరిమిత పరిమాణంలో తింటే అది మన ఆరోగ్యానికి మేలు చేస్తుందట. మరి ఏయే కూరగాయలు ఎలాంటి ఆరోగ్యాన్ని కలిగిస్తాయి, పరిశోధనల్లో ఏం వెల్లడయ్యిందో ఇప్పుడు తెలుసుకుందాం. బచ్చలికూర..: బచ్చలికూర యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి క్యాన్సర్, గుండె సంబంధిత సమస్యలు, టైప్ 2 డయాబెటిస్‌ను నివారించడంలో సహాయపడతాయి. బచ్చలికూరలో పుష్కలంగా ఉండే యాంటీఆక్సిడెంట్ లు కళ్లకు కూడా మేలు చేస్తాయి. ముఖ్యంగా వృద్ధాప్యంలో వచ్చే శ్లేష్మం క్షీణత వంటి కంటి సమస్యలను నివారించడంలో ఇది సహాయపడుతుంది. బచ్చలికూరలో ఫోలేట్, విటమిన్ ఎ, కె, సి అలాగే అనేక విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. గ్రీన్ కొల్లార్డ్..: ఇతర ఆకు కూరల మాదిరిగానే, కాలర్డ్ యాంటీఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటాయి. ఇవి కణాలను దెబ్బతీసే ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. ఇందులో అనేక రకాల పోషకాలు లభిస్తాయి. ఇది మీ ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతున్నారు. గ్రీన్ కొల్లార్డ్ నుండి 25% కాల్షియం కూడా పొందవచ్చని చెబుతున్నారు. బ్రకోలీ: బ్రకోలీ ఒక క్రూసిఫెరస్ వెజిటేబుల్. ఇది క్యాన్సర్‌తో పోరాడటానికి సహాయపడుతుంది. ఇందులో ఉండే సల్ఫోరాఫేన్ ప్రోస్టేట్ , రొమ్ము, మూత్రాశయం, నోటి క్యాన్సర్‌ను నిరోధించడంలో సహాయపడుతుంది. ఇది విటమిన్ సి కి మంచి మూలకం. దీనితో పాటు ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్, ఐరన్ లు రోగనిరోధక వ్యవస్థను బలపరుస్తుంది. చిలగడదుంప..: చిలగడదుంపలను చాలా మంది ఇష్టపడతారు. ఇది మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇందులో బీటా కెరోటిన్ పుష్కలంగా ఉంటుంది. ఇది యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలతో కూడిన పోషకం. బీటా కెరోటిన్ చర్మానికి మేలు చేస్తుందని నిరూపించవచ్చు. ఇది చర్మ క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. చర్మాన్ని యవ్వనంగా ఉంచడంలో ఉపయోగపడుతుంది. మీరు ఒక చిన్న చిలగడదుంప నుండి 4 గ్రాముల ఫైబర్, విటమిన్ ఎ, ఇతర పోషకాలతో పాటు చిన్న మొత్తంలో మెగ్నీషియం, విటమిన్ సి, ఫోలేట్, కాల్షియంలు కూడా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. టొమాటో..: లైకోపీన్ పుష్కలంగా ఉండే టొమాటోలను తినడం వల్ల క్యాన్సర్‌ను నివారించవచ్చు. అలాగే గుండె సంబంధిత సమస్యల ప్రమాదాన్ని కూడా తగ్గించుకోవచ్చు. టొమాటోలో కెరోటినాయిడ్స్‌తో పాటు యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయని ఒక పరిశోధనలో తేలింది.

# మహిళలకు ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి.....




మహిళల గురించి ఎంత చెప్పినా తక్కువే అవుద్దీ. భూదేవికి ఉన్న ఓర్పు సహనంతో ఎన్నో కష్టాలను, నష్టాలను కూడా లెక్క చేయకుండా తన కుటుంబం కోసం పాటుపడేది స్త్రీ. ఇక ఇంట్లో ప్రతి ఒక్కరి ఆరోగ్యం గురించి మహిళ స్పెషల్ కేర్ తీసుకుంటుంది. కానీ తన వరకు వచ్చే వరకు కాస్త వెనకడుగు వేసి, ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తుంటారు. అందువలన ఉమెన్స్ డే స్పెషల్‌గా మహిళలు కొన్ని ఆరోగ్య పరీక్షలకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలి అంటున్నారు నిపుణులు. భారతదేశంలో లక్షలాది మంది జీవనశైలి కారణంగా అనేక అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. ముఖ్యంగా మహిళలు తమకు తెలియకుండానే కొన్ని రకాల క్యాన్సర్, గర్భాశయ వ్యాధుల బారిన పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందువలన ఆరోగ్యం కోసం స్పెషల్ కేర్ తీసుకొని, మహిళలు కొన్ని రకాల పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనారోగ్య సమస్యల నుంచి బయటపడవచ్చునంట. అంతే కాకుండా ఒక వేళ వ్యాధి ఉన్నట్లైతే ప్రాథమిక దశలోనే గుర్తించి తగు చికిత్స తీసుకోవడం ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అంటున్నారు వైద్యులు.

# షుగర్ పేషెంట్స్‌కి తీపి కబురు...!



నేటి ఆధునిక యుగంలో మనిషి జీవనశైలిలో ఎన్నో రకాల మార్పులు వచ్చాయి అన్న విషయం తెలిసిందే. రోజువారి చేసే పనుల దగ్గర నుంచి తినే ఆహారం వరకు అన్నింటిలో కూడా మార్పు వచ్చింది. అయితే ఈ మార్పు మనిషికి ఆనందాన్ని ఇస్తున్నప్పటికీ మనిషి ఆరోగ్యాన్ని మాత్రం పాడు చేస్తుంది అని చెప్పాలి. ఇక నేటి రోజుల్లో ఆహారపు అలవాట్లు అయితే ఇక ఎన్నో అనారోగ్య సమస్యలకు కారణం అవుతున్నాయి. ఇవేవీ పట్టించుకోకుండా మనిషి ముందుకు సాగుతూనే ఉన్నాడు. చివరికి అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు హాస్పిటల్ చుట్టూ తిరుగుతున్న పరిస్థితి కనిపిస్తూ ఉంది. అయితే ఒకప్పుడు ఒక వయసు వచ్చిన తర్వాత షుగరు, బీపీ లాంటి ఏదో ఒక ఆరోగ్య సమస్య వస్తుంది అని అందరూ అనుకునేవారు. కానీ ఇప్పుడు చిన్నపిల్లల దగ్గర నుంచి పెద్ద వాళ్లకు వరకు ఇలాంటి సమస్యలు కనిపిస్తూ ఉన్నాయి. మరీ ముఖ్యంగా ఎక్కువ మందిని మన దేశంలో వేధిస్తున్న సమస్య ఏదైనా ఉంది అంటే అది షుగర్ వ్యాధి అని చెప్పాలి. షుగర్ వ్యాధి బారిన పడుతున్న ఎంతోమంది.. చివరికి హాస్పిటల్స్ చుట్టూ తిరుగుతున్నారు. టాబ్లెట్స్ తోనే సావాసం చేస్తున్నారు. ఇక తరచూ టెస్టులు చేయించుకుంటూనే ఉన్నారు. అయితే షుగర్ లెవెల్స్ ఎలా ఉన్నాయో టెస్ట్ చేయించుకోవడానికి తప్పకుండా పేషంట్స్ నుంచి రక్తం తీయాల్సిందే.

# అధిక బరువు భారంగా ఉందా?




అధిక బరువుతో ఇబ్బంది పడుతున్నారా,చాలా మంది ఈ సమస్యతో ఇబ్బంది పడితున్నారు. కొంతమంది అయితే జిమ్ సెంటర్ కి యోగాసనాలకి వెళ్తూ ఉంటారు. మరికొంతమంది ఇంట్లోనే తెలిసి తెలియని ప్రయోగాలు చేసి ఆరోగ్యాన్ని ఇంకాస్త పాడు చేసుకుంటారు. ఇంకొంతమంది న్యూట్రిషియన్ అని ఏవేవో పౌడర్ లు వాడుతూ ఉంటారు. ఒకే ఒక నెలలో ఎక్కువగా వెయిట్ తగ్గాలని ఇలాంటి ప్రయోగాలు చేస్తూ ఉంటారు. ఇలా చేయడం వల్ల సమస్య తగ్గక పోగా మరిన్ని సైడ్ ఎఫెక్ట్స్ వచ్చే ప్రమాదం ఉంది. మరీ ఇలాంటి వాటిని పక్కన పెట్టి మనం నాచురల్ గా బరువు తగ్గే కొన్ని టిప్స్ పాటిస్తే ఇంట్లోనే ఉంటూ వెయిట్ లాస్ అవ్వొచ్చు. మరి అవేంటో తెలుసుకుందాం. ఉదయం లేవగానే కొంతమందికి కాఫీ టీ తాగే అలవాటు ఉంటుంది. మీరు సిన్సియర్ గా వెయిట్ తగ్గాలి అనుకుంటే ముందుగా ఈ అలవాటు మానుకోవాలి. దీనికి బదులుగా ఉదయం లేవగానే ఒక గ్లాస్ హాట్ వాటర్ లో స్పూన్ జీలకర్ర ని మరిగించి ఆ వాటర్ తీసుకోవడం వల్ల పొట్ట చుట్టూ పేరుకుపోయిన క్రొవ్వుని రెండు నెలలలోనే కరిగించుకోవచ్చు. బరువు పెరగటానికి మరో కారణం టైం కి తినకపోవడం. కొంతమంది ఆడవాళ్లు ఇంట్లో పనులన్నీ అయ్యాక ఉదయం తొమ్మిదికి తినవలసిన బ్రేక్ఫాస్ట్ ని ఆఫ్టర్నూన్ ఎప్పటికో తింటారు. ఈ అలవాటు కూడా మార్చుకోవాలి. నైట్ ఎప్పుడో తిని ఉందయం లేట్ గా తినడం వల్ల కడుపు ఎక్కవ సేపు కాలిగా ఉంటుంది. ఇలా కాలిగా ఉన్న కడుపులోకి గ్యాస్ ఫామ్ అయ్యి తిన్నది సరిగా అరగక కడుపు చుట్టూ క్రొవ్వుగా పేరుకుపోతుంది. నైట్ టైం లో తీసుకునే ఆహారం కూడా చాలా ఇంపార్టెంట్. ఎలాంటి ఆహారం తీసుకున్న కూడా అది ఎనిమిది లోపే తీసుకుంటే ఆరోగ్యానికి ఎంతో మేలు. కొంతమందికి త్వరగా తినడం వల్ల నిద్రపోయే సమయానికి మళ్ళీ ఆకలేస్తూ ఉంటుంది.

# కాశీ రక్షకుడు భైరవ




ప్రభాస్ 'కల్కి 2898 ఏడీ' చిత్రం నిర్మాణం నుంచే దేశవ్యాప్తంగా ప్రేక్షకుల్లో ఆసక్తినిరేకెత్తిస్తున్నది. భారతీయ పురాణేతిహాసాల స్ఫూర్తితో సోషియో ఫాంటసీ హంగులతో దర్శకుడు నాగ్‌అశ్విన్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మే 9న ప్రేక్షకుల ముందుకురానుంది. మహాశివ రాత్రిని పురస్కరించుకొని శుక్రవారం తాజా అప్‌డేట్ వెలువడింది. 'భైరవ'గా ప్రభాస్ పాత్ర పేరును పరిచయం చేస్తూ మేకర్స్ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. 'కాశీ భవిష్యత్తు వీధుల నుంచి 'భైరవ'ను పరిచయం చేస్తున్నాం' అంటూ చిత్ర బృందం పేర్కొంది. ఇందులో ప్రభాస్ దృఢకాయంతో అత్యంత శక్తివంతంగా కనిపిస్తున్నారు. బ్యాక్‌గ్రౌండ్‌లో భవిష్యత్తు కాశీ నగరం కనిపిస్తున్నది. ప్రభాస్ డ్రెస్సింగ్‌స్టైల్, లుక్స్ విభిన్నంగా కనిపిస్తున్నాయి. మహాభారత కాలంలో మొదలై 2898 వరకు ఈ చిత్ర కథ నడుస్తుందని, మైథాలజీ ఫిక్షన్‌గా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుందని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్ ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు.



# ఆయనకు సెన్స్ ఆఫ్ హ్యూమర్ ఎక్కువ..

'జాకీలోని సెన్స్ ఆఫ్ హ్యూమరే మొదట నన్ను ఆకర్షించింది. తనతో ఉంటే సమయం తెలీదు.' అంటూ తన భర్త ముచ్చట్లు చెప్పుకొచ్చింది అందాలభామ రకుల్ ప్రీత్‌సింగ్. ఇటీవలే అస్సాంలో ఓ కార్యక్రమానికి భర్తతో కలిసి హాజరైంది రకుల్. ఈ సందర్భంగా జరిగిన సరదా సంభాషణలో తనకు సెన్స్ ఆఫ్ హ్యూమర్ ఎక్కువ అని రకుల్ భర్త, ప్రముఖ బాలీవుడ్ నిర్మాత జాకీ భగ్నానీ చెప్పగా.. ఆ పక్కనే ఉన్న రకుల్ 'అది మాత్రం నిజం. తను నవ్వుతూ, పక్క ఉన్న వారందర్నీ నవ్విస్తాడు. అందర్నీ సంతోషంగా ఉండేలా చూడటం అతని ప్రత్యేకత. అందుకే ఆయన్ను ఇష్టపడ్డాను. జాకీ అద్భుతమైన హాస్య చతురత కలిగిన వ్యక్తి.. అంతకు మించి మంచి మనసున్న వ్యక్తి. అటువంటి మనిషి నా భర్త కావడం నా అదృష్టం' అంటూ తన భర్తను పొగడ్తలతో ముంచెత్తింది రకుల్.




# నేనెప్పుడూ అలా చెప్పలేదు..

## పుకార్లపై రష్మిక మందన్నా

తెలుగు, తమిళంతోపాటు వివిధ భాషల్లో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్న భామల్లో టాప్‌లో ఉంటుంది కన్నడ సోయగం రష్మిక మందన్నా. ఈ భామకు సంబంధించిన ఏదో ఒక గాసిప్ సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తుందని తెలిసిందే. రష్మిక చేతిలో కేవలం యాక్షన్ సినిమాలు మాత్రమే ఉన్నాయని, ఈ బ్యూటీ రొమాంటిక్ సినిమాల్లో నటించేందుకు ఆసక్తి చూపిస్తుందని చెప్పినట్టు నెట్టింట వార్తలు దర్శనమిచ్చాయి. అయితే వీటిపై రష్మిక ట్విట్టర్ ద్వారా స్పందిస్తూ.. అలాంటిదేమి లేదని, తానెప్పుడూ అలా చెప్పలేదని స్పష్టత ఇచ్చింది. అయినప్పటికీ రష్మికపై కొన్ని రోజులకు మరో గాసిప్ తెరపైకి వచ్చింది. యానిమల్ గ్రాండ్ సక్సెస్ తర్వాత రష్మిక మందన్నా తన రెమ్యునరేషన్‌ను పెంచేసిందంటూ పుకారు ఆన్‌లైన్‌లో చక్కర్లు కొడుతోంది. అంతటితో ఆగకుండా ఆడవాళ్లు మీకు జోహార్లు సినిమాను స్క్రిప్ట్ నచ్చకున్నా కేవలం శర్వానంద్, డైరెక్టర్ కిశోర్ తిరుమల వల్లే ఒప్పుకుందంటూ న్యూస్ రౌండప్ చేస్తోంది. అయితే ఇలా వరుస పుకార్లను కొట్టిపారేస్తూ సోషల్ మీడియాలో తెగ చర్చించుకుంటున్న అభిమానులకు ఎప్పటికప్పుడూ క్లారిటీ ఇస్తూ వస్తోంది రష్మిక. ఈ భామ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉంది. వీటిలో ఒకటి పుష్ప ది రూల్. మరోవైపు శేఖర్ కమ్ముల, ధనుష్ కాంబోలో వస్తున్న DNSలో కూడా నటిస్తోంది. దీంతోపాటు The Girlfriend చిత్రంలో కూడా నటిస్తోంది

# ఫిబ్రవరి వాహన విక్రయాల్లో 13శాతం వృద్ధి.....



ఫిబ్రవరి వాహన రిటైల్ విక్రయాలు వార్షిక ప్రాతిపదికన 13 శాతం పెరిగినట్లు ఆటో మొబైల్ డీలర్ల సమాఖ్య ఫాడా గురువారం నాడు తెలిపింది. అన్ని విభాగాల వాహనాల అమ్మకాలు పెరిగాయని పేర్కొంది. అంతకు ముందు సంవత్సరం ఫిబ్రవరి నెలలో 17,94,866 యూనిట్ల విక్రయాలు జరిగితే, 2024 ఫిబ్రవరిలో ఈ సంఖ్య 20,29,541 యూనిట్లుగా ఉందని ఫాడా తెలిపింది. ప్రయాణికుల వాహన విక్రయాలు 2023 ఫిబ్రవరిలో 2,29,803 యూనిట్లుగా నమోదయ్యాయి.ఈ సారి అవి 12 శాతం పెరిగి 3,30,107 యూనిట్లుగా నమోదయ్యాయి. ఫిబ్రవరిలో ఈ విభాగంలో ఇప్పటివరకు ఇదే రికార్డు. కొత్త కార్ల విడుదల, వాహనాలు అందుబాటులో ఉండడమే రికార్డు స్థాయి అమ్మకాలకు దోహదం చేసినట్లు ఫాడా తెలిపింది. ద్విచక్ర వాహన అమ్మకాలు వార్షిక ప్రాతిపదికన 13 శాతం పెరిగి 14,39,523 యూనిట్లకు చేరాయి. గ్రామీణ ప్రాంతాల్లో గిరాకీ, ప్రీమియం మోడళ్లకు డిమాండ్, ఎంట్రీ లెవెల్ బైక్‌లకు ఆదరణ వంటి కారణాలు అమ్మకాలు పెరిగేందుకు దోహదం చేసినట్లు ఫాడా తెలిపింది. పెళ్లిళ్ల సీజన్, ఆర్థిక పరిస్థితులు మెరుగ్గా ఉండటం కూడా అమ్మకాలకు కలిసి వచ్చిందని తెలిపింది. వాణిజ్య వాహన విక్రయాలు గత సంవత్సరంతో పోలిస్తే 5 శాతం పెరిగి 88,367 యూనిట్లుగా నమోదయ్యాయి. ఎన్నికల సీజన్ కావడంతో కొనుగోళ్లు వాయిదా వంటి ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ ఈ విభాగంలో వృద్ధి నమోదైనట్లు తెలిపింది. త్రిచక్ర వాహన అమ్మకాలు 24 శాతం పెరిగి 94,918 యూనిట్లకు చేరాయి. ట్రాక్టర్ల అమ్మకాలు 11 శాతం పెరిగి 76,626కు చేరాయి. దేశీయంగా ప్యాసింజర్ వాహన పరిశ్రమ ఈ ఆర్థిక సంవత్సరంలో 6-9 శాతం పెరిగే అవకాశం ఉందని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా తెలిపింది. ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు 40.2 లక్షల యూనిట్లకు చేరే అవకాశం ఉందని అంచనా వేసింది. బలమైన రిటైల్ అమ్మకాలు ఉన్నప్పటికీ డీలర్ల ఇన్వెంటరీలు ఎక్కువగానే ఉన్నాయని తెలిపింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో వృద్ధి వేగం తగ్గుతుందని ఇక్రా అంచనా వేసింది.

## పదేళ్లు..రూ.20లక్షల కోట్ల సెల్‌ఫోన్ల తయారీ



న్యూఢిల్లీ: గత పదేళ్లలో దేశీయంగా తయారైన సెల్‌ఫోన్ల విలువ దాదాపు రూ.20 లక్షల కోట్లకు చేరిందని పరిశ్రమ సంఘం ఐసీఈఏ (ఇండియన్ సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్) తెలిపింది. ఈ సమయంలో దేశంలో మొత్తం 245 కోట్ల సెల్‌ఫోన్లను తయారు/అసెంబ్లింగ్ చేశారని వీటి విలువ రూ.19,45,100 కోట్లని వెల్లడించింది. 250 కోట్ల పరికరాల తయారీ లక్ష్యం కాగా, సమీపానికి చేరినట్లు వివరించింది. 2014-15లో దేశీయంగా సెల్‌ఫోన్ తయారీ పరిశ్రమ రూ18,900 కోట్ల స్థాయిలో ఉండగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 2000% అధికమై రూ.4,10,000 కోట్లకు చేరినట్లు తెలిపింది. 3.7 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.307 లక్షల కోట్ల) స్థాయిలోని దేశ జీడీపీ, 2030 కల్లా 7 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.581 లక్షల కోట్ల)కు చేరుతుందనేది తమ అంచనాగా ఐసీఈఏ ఛైర్మన్ పంకజ్ మొహింద్రో పేర్కొన్నారు. ఈ వృద్ధిలో డిజిటల్ సెక్టార్‌తో పాటు ఎలక్ట్రానిక్స్-మొబైల్స్ తయారీ కూడా ముఖ్యపాత్ర పోషిస్తాయని వివరించారు. త్వరలో ఎగుమతులే రూ.5 లక్షల కోట్లకు!: మన దేశం నుంచి మొబైల్ ఫోన్ల ఎగుమతులు వచ్చే కొన్నేళ్లలో రూ.5 లక్షల కోట్ల సమీపానికి చేరనున్నాయని కేంద్ర ఐటీ, కమ్యూనికేషన్స్ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో 11 బి.డాలర్ల (సుమారు రూ.91,300 కోట్లు) విలువైన సెల్‌ఫోన్లు ఎగుమతి అయ్యాయని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ మొత్తం రూ.1.2 లక్షల కోట్లకు చేరుతుందనే అంచనా ఉందన్నారు.

## పిఎస్‌యుల్లో ఆగని డిజిన్వెస్ట్‌మెంట్





**ముంబయి:** సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతోన్న సమయంలోనూ మోడీ సర్కార్ పిఎస్‌యుల్లో వాటాల విక్రయాన్ని దర్జాగా కొనసాగిస్తోంది. ఎన్ఎల్‌సి ఇండియా (ఇంతక్రితం నైవేలీ లిగ్నైట్ కార్ప్)లో 7 శాతం వాటాలను ప్రయివేటు శక్తులకు కట్టబెట్టే ప్రక్రియ ప్రారంభమైంది. ఇందుకోసం గురువారం ఆఫర్ ఫర్ సేల్ (ఒఎఫ్ఎస్)ను తెరిచింది. ఇందులో రూ.2,100 కోట్ల విలువ చేసే 6.9 కోట్ల షేర్లను విక్రయించనుంది. సోమవారం రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి బిడ్లకు అవకాశం ఇవ్వగా. అదే రోజు ఇష్యూను ముగించనుంది. శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా మార్కెట్లకు సెలవు. ఎన్ఎల్‌సి ఇండియాలో ప్రస్తుతం కేంద్రానికి 79.2 శాతం వాటా ఉంది. ఈ ఒఎఫ్ఎస్‌కు ఐసిఐసిఐ సెక్యూరిటీస్, డిఎఎం కాపిటల్ అడ్వైజర్స్ లిమిటెడ్ బ్రోకర్స్‌గా వ్యవహరిస్తున్నాయి. తాజా వాటాల విక్రయం తర్వాత ఎన్ఎల్‌సిలో ప్రభుత్వ వాటా 75 శాతం దిగువకు పడిపోనుంది. ఇటీవల ప్రవేశపెట్టిన 2024-25 బడ్జెట్‌లో రూ.50వేల కోట్ల విలువ చేసే పిఎస్‌యుల వాటాలను విక్రయించాలని మోడీ సర్కార్ లక్ష్యంగా పెట్టుకుంది.

## పబ్లిక్ ఇష్యూకు సాయి లైఫ్‌సైన్సెస్...?




**హైదరాబాద్ :** కాంట్రాక్టు పరిశోధన, ఉత్పత్తి (సీడీఎంఓ) విభాగంలో కార్యకలాపాలు సాగిస్తున్న సాయి లైఫ్‌సైన్సెస్ తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు వెళ్లే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ సంస్థలో టీపీజీ కేపిటల్ అనే ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) పెట్టుబడుల సంస్థ మూడేళ్ల క్రితం 135 మిలియన్ డాలర్ల (డాలర్ ప్రస్తుత విలువ ప్రకారం సుమారు రూ.1120 కోట్లు) పెట్టుబడి పెట్టింది. దానివల్ల ఈ సంస్థకు సాయి లైఫ్‌సైన్సెస్‌లో 43.3% వాటా లభించింది. ఈ వాటాను విక్రయించాలని టీపీజీ కేపిటల్ కొంతకాలంగా కసరత్తు చేస్తోంది. దీన్ని సొంతం చేసుకోవటానికి అడ్వెంట్ ఇంటర్నేషనల్, ఒంటారియో పెన్షన్ ప్లాన్, అపాక్స్ పార్ట్‌నర్స్, కేకేఆర్, బెయిన్ కేపిటల్.. వంటి పెట్టుబడి సంస్థలు ఆసక్తి చూపాయి. కానీ సంస్థాగత విలువపై ఏకాభిప్రాయం రాకపోవడంతో అడుగు ముందుకు పడలేదని తెలిసింది. దాదాపు 1 బిలియన్ డాలర్ల (సుమారు రూ.8,300 కోట్లు) సంస్థాగత విలువ ఉండాలని సాయి లైఫ్‌సైన్సెస్ ప్రమోటర్లు, యాజమాన్యం భావిస్తున్నట్లు సమాచారం. అందువల్ల పెట్టుబడి సంస్థలకు వాటా విక్రయించడానికి బదులు ఐపీఓకు వెళ్తే, అధిక సంస్థాగత విలువ లభిస్తుందనే ఉద్దేశంతో ఆ దిశగా సన్నాహాలు మొదలు పెట్టినట్లు ఔషధ పరిశ్రమ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పబ్లిక్ ఇష్యూ వల్ల 'ఆఫర్ ఫర్ సేల్' రూపంలో కొంత వాటా విక్రయించే అవకాశం టీపీజీ కేపిటల్‌కు లభిస్తుంది. దానివల్ల ఈ సంస్థకు సాయి లైఫ్‌సైన్సెస్‌లో 43.3% వాటా లభించింది. ఈ వాటాను విక్రయించాలని టీపీజీ కేపిటల్ కొంతకాలంగా కసరత్తు చేస్తోంది. దీన్ని సొంతం చేసుకోవటానికి అడ్వెంట్ ఇంటర్నేషనల్, ఒంటారియో పెన్షన్ ప్లాన్, అపాక్స్ పార్ట్‌నర్స్, కేకేఆర్, బెయిన్ కేపిటల్.. వంటి పెట్టుబడి సంస్థలు ఆసక్తి చూపాయి. కానీ సంస్థాగత విలువపై ఏకాభిప్రాయం రాకపోవడంతో అడుగు ముందుకు పడలేదని తెలిసింది.దాదాపు ఏడాదిన్నర కాలం తర్వాత స్టాక్‌మార్కెట్లో ఔషధ కంపెనీలపై మదుపరుల్లో ఆసక్తి కనిపిస్తోంది. ఇంతకాలం స్తబ్దుగా ఉన్న ఫార్మా కంపెనీల ఆదాయాలు, లాభాలు వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి కోలుకునే అవకాశం ఉన్నట్లు పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇటువంటి సానుకూల పరిస్థితుల్లో ఫార్మా కంపెనీలు పబ్లిక్ ఇష్యూకు వెళ్తే మేలు జరుగుతుందని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. అందువల్లే పబ్లిక్ ఇష్యూకు వెళ్లడాన్ని సాయి లైఫ్ సైన్సెస్ యాజమాన్యం పరిశీలిస్తున్నట్లు వివరిస్తున్నారు.


## దేశీయ స్టాక్ మార్కెట్ల దూకుడు..
## 74వేల మార్క్‌ను దాటిన సెన్సెక్స్.. ఆల్‌టైమ్ హైకి నిఫ్టీ..!



దేశీయ స్టాక్ మార్కెట్లు మరోసారి జీవితకాల గరిష్ఠానికి చేరాయి. సెన్సెక్స్ తొలిసారిగా 74వేల మార్క్‌ను దాటింది. అదే సమయంలో నిఫ్టీ సైతం తొలిసారిగా సరికొత్తగా రికార్డు స్థాయిలో ఆల్‌టైమ్ హైకి చేరింది. కిత్రం సెషన్‌తో పోలిస్తే బుధవారం ఉదయం స్టాక్ మార్కెట్లు నష్టాల్లో మొదలయ్యాయి. ఆ తర్వాత కొద్దిసేపటికే సూచీలు కోలుకొని లాభాల్లోకి వెళ్లాయి. చివరి వరకు అదే జోరును కొనసాగించాయి. సెన్సెక్స్ ఉదయం 73,587.70 పాయింట్ల వద్ద నష్టాల్లో మొదలైంది. ఒక దశలో 73,321.48 పాయింట్ల కనిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. ఇంట్రాడేలో 74,151.27 పాయింట్ల గరిష్ఠానికి చేరుకొని సరికొత్త రికార్డును నెలకొల్పింది. చివరకు 408.86 పాయింట్ల లాభంతో 74,085.99 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం కిత్రం సెషన్‌తో పోలిస్తే నష్టాల్లోనే మొదలైంది. 22,327.50 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభం కాగా.. ఒక దశలో 22,224.35 పాయింట్లకు పడిపోయింది. ఆ తర్వాత 22,497.20 పాయింట్ల గరిష్ఠాన్ని నమోదు చేసి తొలిసారిగా జీవితకాల గరిష్ఠానికి పెరిగింది. చివరకు 22,497.20 పాయింట్ల లాభంతో 22,474.05 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 508 షేర్లు పురోగమించగా, 2820 షేర్లు క్షీణించాయి మరియు 53 షేర్లు మారలేదు.

## ఈ 30 బ్యాంకుల్లో అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్స్..
## నిలిచిపోయిన డబ్బు పొందడం ఎలా?

మీ తాతలు లేదా తల్లిదండ్రులకు ఈ 30 బ్యాంకుల్లో ఏదైనా ఒకటి లేదా అంతకంటే ఎక్కువ బ్యాంకుల్లో పాత బ్యాంక్ ఖాతా ఉంటే. ఏళ్ల తరబడి ఎలాంటి లావాదేవీలు జరగని ఖాతా లేదా ప్రభుత్వ సబ్సిడీకి లింక్ చేయబడినది కానీ చాలా కాలంగా యాక్సెస్ చేయలేదు. మీ కుటుంబం డబ్బు బ్యాంకు ఖాతాలో ఎక్కడైనా నిలిచిపోయి ఉంటే, ఇప్పుడు మీరు దానిని క్లెయిమ్ చేయడానికి ఉపయోగించవచ్చు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్. మీ తాతలు లేదా తల్లిదండ్రులకు ఈ 30 బ్యాంకుల్లో ఏదైనా ఒకటి లేదా అంతకంటే ఎక్కువ బ్యాంకుల్లో పాత బ్యాంక్ ఖాతా ఉంటే. ఏళ్ల తరబడి ఎలాంటి లావాదేవీలు జరగని ఖాతా లేదా ప్రభుత్వ సబ్సిడీకి లింక్ చేయబడినది కానీ చాలా కాలంగా యాక్సెస్ చేయలేదు. మీ కుటుంబం డబ్బు బ్యాంకు ఖాతాలో ఎక్కడైనా నిలిచిపోయి ఉంటే, ఇప్పుడు మీరు దానిని క్లెయిమ్ చేయడానికి ఉపయోగించవచ్చు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవ మీకు ఇందులో సహాయపడుతుంది. బ్యాంకుల్లో పడి ఉన్న 'క్లెయిమ్ చేయని మొత్తాన్ని' వాపసు చేసేందుకు ఆర్‌బీఐ 'ఉద్గం పోర్టల్'ను ప్రారంభించింది. దీనికి 'అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్స్ గేట్‌వే టు యాక్సెస్ ఇన్ఫర్మేషన్' అని పేరు పెట్టారు. ఈ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవడం ద్వారా పాత డబ్బును తిరిగి పొందవచ్చు. ఈ పోర్టల్‌తో ఇప్పటి వరకు 30 బ్యాంకులను అనుసంధానం చేసినట్లు ఆర్‌బీఐ మంగళవారం తెలిపింది. వీటిలో ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, కెనరా బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్ వంటి ప్రభుత్వ బ్యాంకులు మాత్రమే కాకుండా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌ఎస్‌బీసీ బ్యాంక్, స్టాండర్డ్ చార్టర్డ్ వంటి ప్రైవేట్ బ్యాంకులు కూడా ఉన్నాయి.




## దేశంలో బ్యాంక్ లాకర్ల కొరత..
## డిమాండ్, సప్లై మధ్య భారీ అంతరం..




ఈ డిమాండ్ అంతకంతకూ పెరుగుతోంది. దేశ వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. ఈ క్రమంలో మన దేశంలో బ్యాంక్ లాకర్ల లభ్యత తగ్గిపోతోందని ప్రముఖ లాకర్ల స్టార్టప్ ఆర్మ్ ఓ నివేదికను అందించింది. దేశంలో డిమాండ్ కు అనుగుణంగా లాకర్ల లభ్యత లేదనిన ఆ నివేదిక స్పష్టం చేసింది. దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పింది. విలువైన వస్తువులు, డాక్యుమెంట్ల వంటివి భద్రపరచుకునేందుకు ఉపయోగపడేవి బ్యాంక్ లాకర్లు. వీటిల్లో భద్రత, సౌకర్యం ఉంటుండటంతో ఇటీవల కాలంలో ఎక్కువ శాతం మంది ప్రజలు వీటిని వినియోగించుకుంటున్నారు. దీంతో బ్యాంకులు కూడా పెద్ద ఎత్తున లాకర్లను ఏర్పాటు చేస్తున్నాయి. ఈ డిమాండ్ అంతకంతకూ పెరుగుతోంది. దేశ వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. ఈ క్రమంలో మన దేశంలో బ్యాంక్ లాకర్ల లభ్యత తగ్గిపోతోందని ప్రముఖ లాకర్ల స్టార్టప్ ఆర్మ్(%ూబతీఎ%) ఓ నివేదికను అందించింది. దేశంలో డిమాండ్ కు అనుగుణంగా లాకర్ల లభ్యత లేదనిన ఆ నివేదిక స్పష్టం చేసింది. దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పింది. 2030 నాటికి భారతీయ నగరాల్లో సేఫ్ డిపాజిట్ స్టోరేజీ లాకర్లు అవసరమయ్యే ఆరు కోట్ల మంది సంపన్న భారతీయులు ఉంటారని ఆర్మ్ అంచనా వేసింది. అయితే ప్రస్తుతం దేశవ్యాప్తంగా 60 లక్షల బ్యాంకు లాకర్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఈ విధంగా, లాకర్ల డిమాండ్, లాకర్ల లభ్యత మధ్య అంతరం సుమారు 5.4 కోట్లు ఉంటుందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ప్రచురించిన వివిధ నివేదికల నుంచి.. అనేక మంది బ్యాంకింగ్ అధికారులతో మాట్లాడిన తర్వాత కమిషన్ చేసిన నివేదికలో ఈ విషయాలను వెల్లడించింది.

# డిఎంకె కూటమితో కమల్ హాసన్ పార్టీ పొత్తు



చెన్నై: నటుడు, రాజకీయ నేత కమల్ హాసన్ సారథ్యంలోని మక్కళ్ నీది మయ్యం(ఎంఎన్ఎం) శనివారం డిఎంకె నేతృత్వంలోని కూటమిలో చేరింది. రానున్న లోక్‌సభ ఎన్నికలలో డిఎంకె కూటమి తరఫున ప్రచారం చేయనున్నట్లు ఎంఎన్ఎం ప్రకటించింది. 2025లో జరిగే రాజ్యసభ ఎన్నికలలో తమకు ఒక సీటును కేటాయించినట్లు ఆ పార్టీ ప్రకటించింది. కమల్ హాసన్ పార్టీకి లోక్‌సభ ఎన్నికలలో సీట్లను కేటాయిస్తారని ఊహాగానాలు సాగుతున్న తరుణంలో ఈ ప్రకటన వెలువడింది. చెన్నైలోని డిఎంకె ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో డిఎంకె అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్, కమల్ హాసన్ మధ్య ఈ మేరకు ఒప్పందం కుదిరింది. దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే తమ పార్టీ డిఎంకె సారథ్యంలోని కూటమిలో చేరినట్లు చెన్నైలో విలేకరులతో మాట్లాడుతూ కమల్ హాసన్ తెలిపారు. తాము ఎటువంటి పదవులను ఆశించడం లేదని ఆయన చెప్పారు. రానున్న లోక్‌సభ ఎన్నికలలో తాము పోటీ చేయడం లేదని, డిఎంకె సారథ్యంలోని కూటమికి సంపూర్ణ మద్దతును అందచేస్తామని ఆయన తెలిపారు. ఇది పదవుల కోసం కాదని, దేశం కోమని ఆయన అన్నారు. ఇద్దరు నాయకుల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం తమిళనాడులోని 39 లోక్‌సభ స్థానాలు, పుదుచ్చేరిలోని ఏకైక లోక్‌సభ స్థానంలో ఎంఎన్ఎం కూటమి తరఫున ప్రచారం చేస్తుంది.

# అరుణాచల్ పిసిసి అధ్యక్షుడి రాజీనామా



ఇటానగర్: త్వరలో లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో అరుణాచల్ మాజీ ముఖ్యమంత్రి నాబం టుకీ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఏఐసిసి అధ్యక్షుడికి టుకీ తన రాజీనామా లేఖను శుక్రవారం పంపించినట్లు పార్టీ నాయకుడు ఒకరు శనివారం తెలిపారు. పార్టీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు బిజెపిలోకి ఫిరాయించిన దరిమిలా టుకీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన చెప్పారు. ఇతర రాజకీయ పార్టీలకు ఫిరాయిస్తున్న పార్టీ ఎమ్మెల్యేలను నిలువరించడంలో విఫలమైనందున నైతిక బాధ్యత వహిస్తూ టుకీ తన పదవికి రాజీనామా చేసినట్లు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి గ్యామర్ తనా తెలిపారు. రాష్ట్రంలోని సగలీ అసెంబ్లీ స్థానానికి టుకీ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తూర్పు సియాంగ్ జిల్లాలోని మెబో నుంచి ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన కాంగ్రెస్ శాసనసభా పక్ష నాయకుడు లోంబో తాయెంగ్ ఈ నెల మొదట్లో బిజెపిలో చేరారు. మరో ఇద్దరు ఎమ్మెల్యేలు కూడా బిజెపిలో చేరారు.

# లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ: మాయావతి



లక్నో: వచ్చే లోక్‌సభ ఎన్నికలలో తమ పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని బహుజన్ సమాజ్ పార్టీ(బిఎస్‌పి) అధ్యక్షురాలు మాయావతి స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల కోసం బిఎస్‌పి పూర్తి సన్నద్ధతతో, శక్తితో పోటీ చేసేందుకు ఏర్పాటు చేస్తోందని శనివారం సామాజిక ఎక్స్ వేదికగా ఆమె తెలిపారు. ఎన్నికల పొత్తులు లేదా తృతీయ ఫ్రంట్ ఏర్పాటుకు సంబంధించి తమ పార్టీపై వస్తున్న వదంతులను అసత్యాలుగా ఆమె అభివర్ణించారు. ఇటువంటి తప్పుదారి పట్టించే వార్తలను నమ్మవద్దని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మీడియా కూడా సంయమనం పాటించాలని, తప్పుడు వార్తలను ప్రాధాన్యత ఇవ్వవద్దని ఆమె కోరారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. ప్రత్యేకంగా ఉత్తర్ ప్రదేశ్‌లో బిఎస్‌పి బలంగా ఉన్నందున ప్రతిపక్షాలు ఆందోళన చెందుతున్నట్లు కనపడుతోందని ఆమె వ్యాఖ్యానించారు. ఈ కారణంగానే ప్రజలను తప్పుదారి పట్టించేందుకు నిత్యం వదంతులను వ్యాప్తి చేస్తున్నాయని ఆమె ఆరోపించారు. ఏదేమైనప్పటికీ..బ హుజనుల ప్రయోజనాల కోసం రానున్న లోక్‌సభ ఎన్నికలలో ఒంటరిగానే పోటీ చేయాలని నిర్ణయించామని ఆమె తెలిపారు. బిఎస్‌పిని ఇండియా కూటమిలో చేర్చడానికి పలువురు నాయకులు ప్రయత్నాలు సాగిస్తున్న నేపథ్యంలో తాము కూటమిలో చేరడంపై వస్తున్న వదంతులను మాయావతి గత నెలలో కూడా కొట్టివేశారు. లోక్‌సభ ఎన్నికలలో బిజెపికి వ్యతిరేకంగా జరిగే ఉమ్మడి పోరాటంలో బిఎస్‌పి కూడా చేరేందుకు ఇండియా కూటమి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని ఉత్తర్ ప్రదేశ్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ అవినాశ్ పాండే గత నెలలో ప్రకటించారు. ఇప్పటికే కాంగ్రెస్, సమాజ్‌వాది పార్టీ మధ్య సీట్ల సర్దుబాటు ఒప్పందం యుపిలో కుదిరింది. కాంగ్రెస్ రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలలో పోటీచేయనున్నది. ఇండియా కూటమిలోని మిగిలిన పక్షాలు 63 స్థానాలలో పోటీ చేయనున్నాయి. కాగా..రానున్న లోక్‌సభ ఎన్నికల కోసం తెలంగాణలో బిఆర్ఎస్‌తో బిఎస్‌పి గత మంగళవారం పొత్తు కుదుర్చుకుంది. ఈ విషయాన్ని బిఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావు, బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రకటించారు. త్వరలోనే బిఎస్‌పి అధినేత్రి మాయావతితో తాను మాట్లాడతానని కెసిఆర్ చెప్పగా తాను ఇప్పటికే పొత్తు విషయాన్ని మాయావతితో చర్చించినట్లు ప్రవీణ్ కుమార్ తెలిపారు.

# రూ.2వేల కోట్ల డ్రగ్స్ అక్రమ రవాణా కేసులో సినీ నిర్మాత అరెస్ట్



అంతర్జాతీయ డ్రగ్స్ దందాలో తమిళనాడుకు చెందిన సినీ నిర్మాత ఏఆర్ జాఫర్ సాదిక్ ను పోలీసులు అరెస్ట్ చేశారు. రూ.2వేల కోట్ల విలువైన డ్రగ్స్ అక్రమ రవాణా కేసులో జాఫర్‌ను అరెస్ట్ చేసినట్లు ఎన్‌సీబీ అధికారులు శనివారం వెల్లడించారు. దేశంలో భారీ డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టైన విషయం తెలిసిందే. ఢిల్లీ పోలీసులు, ఎన్‌సీబీ అధికారులు గత నెలలో సంయుక్త ఆపరేషన్ చేపట్టి అంతర్జాతీయ డ్రగ్ నెట్‌వర్క్‌ను ఛేధించారు. ఈ కేసులో ఇప్పటికే అధికారులు కొందరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 50 కిలోల సూడోఎఫెడ్రిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ దందాలో జాఫర్ సాదిక్ కీలక సూత్రధారిగా గుర్తించిన పోలీసులు అతడి కోసం తీవ్రంగా గాలింపు చేపట్టారు. ఎట్టకేలకు అతడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎన్‌సీబీ అధికారులు ఇవాళ వెల్లడించారు. కాగా, ఈ డ్రగ్ నెట్‌వర్క్ భారతదేశం, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, మలేషియాలకు విస్తరించినట్లు పోలీసులు తెలిపారు. హెల్త్ మిక్స్ పౌడర్, ఎండు కొబ్బరి వంటి ఆహార పదార్థాల ముసుగులో కొన్ని సరకుల ద్వారా దీనిని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. గత 3 ఏళ్లలో మొత్తం 45 సరకులు పంపారని, అందులో సుమారు 3,500 కిలోల సూడోఎఫెడ్రిన్ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. దాని విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.2000 కోట్లకు పైగా ఉంటుందని చెప్పారు. అంతేకాదు మొత్తం నెట్‌వర్క్‌ను ఛేధించడానికి ఆయా దేశాల్లో ఉన్న నిందితులను కూడా అరెస్టు చేయడానికి న్యూజిలాండ్, ఆస్ట్రేలియా అధికారులను సంప్రదించినట్లు పోలీసులు వెల్లడించారు.సాదిక్ తమిళనాడు లోని అధికార డీఎంకే కి చెందిన వ్యక్తి. భారీ డ్రగ్ రాకెట్‌లో ఆయన కీలక పాత్ర ఉన్నట్లు అధికారులు గుర్తించడంతో.. డీఎంకే సాదిక్‌పై ఇటీవలే చర్యలు తీసుకుంది.

## కెనడా ఖలీస్తానీ నిజ్జర్ హత్యోదంతం..

# వెలుగులోకి వీడియో



టొరంటో: కెనడాలో ఖలీస్థానీ నేత ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యోందతపు వీడియో ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. కెనడాలోని సర్రేలోని ఓ గురుద్వారా వెలుపల తొమ్మిది నెలల క్రితంఆయన హత్యకు గురయ్యారు. బ్రిటిష్ కొలంబియా ప్రాంతపు సర్రేలో ఓ సాయుధుడు ఆయనపై అంతా చూస్తూ ఉండగానే కాల్పులకు దిగిన ఘట్టం ఇప్పుడు వీడియోరూపంలో వైరల్ అయింది. కెనడాలో నిజ్జర్ హత్యోదంతం కెనడా, భారతదేశాల నడుమ దౌత్య స్థాయి చిచ్చుకు దారితీసింది. 2023 జూన్ 12వ తేదీ సాయంత్రం ఈ హత్య జరిగింది. నిజ్జర్‌ను భారత ప్రభుత్వం 2020లోనే ఉగ్రవాదిగా ప్రకటించింది. ఈ ఘటన వీడియోను సిబిసి న్యూస్ కెనడా దర్యాప్తు క్రమపు డాక్యుమెంటరీ సీరిస్ ద్వారా సేకరించింది. ఆ రోజు జరిగిన ఘటన వివరాలన్నీ ఈ వీడియోలో పొందుపర్చి ఉన్నాయి. గురుద్వారా వెలుపల పార్కింగ్ స్థలి నుంచి నిజ్జర్ తన గోధుమ రంగు డోడ్జ్ రామ్ పికప్ వ్యాన్‌లో వెళ్లడం , దీనిని ఓ తెల్లటి సుడన్ కారు వెంబడించడం , నిజ్జార్ వాహనం ముందు వచ్చి నిలవడం , వెంటనే అందులో నుంచి ఇద్దరు కిందికి దిగి ఆయనపై కాల్పులు జరపడం, తరువాత సిల్వర్ టయోటా కామ్రి కారులో ఫరారు కావడం కన్పించింది. ఈ ప్రాంతానికి సమీపంలో ఫుట్‌బాల్ ఆడుకుంటున్న వారిద్దరు ఇప్పుడు ఈ ఘటనకు ప్రత్యక్ష సాక్షులు అయ్యారు. కాల్పుల చప్పుడు వినబడగానే తాము పరుగులు తీసి వచ్చామని కారులోని దుండగులను పట్టుకునేందుకు యత్నించామని వీరు చెప్పారని సిబిసి తెలిపింది. తరువాత కిందపడి స్పృహకోల్పోయి ఉన్న వ్యక్తిని రక్షించేందుకు చూశామని వివరించారు. అయితే అప్పటికే ఆయన ప్రాణాలు కోల్పోయినట్లు గుర్తించామని ప్రత్యక్ష సాక్షులలో ఒక్కరైన భూపీందర్ సింగ్ సిద్ధూ తెలిపారు. దుండగులను పట్టుకోలేకపోయ్యామని, బాధితుడు ప్రాణాలు వదిలాడని వివరించారు. నిజ్జర్ హత్య వెనుక భారత ఇంటలిజెన్స్ సంస్థలు, ప్రత్యేకించి కొందరు ఇండియా ఏజెంట్లు ఉన్నారని, తమ భూభాగంలో ఓ కెనడా పౌరుడి వధను ఖండిస్తున్నామని, ఘటనకు భారత దేశం బాధ్యత వహించాలని కెనడా ప్రధాని ట్రూడో అప్పట్లో పేర్కొనడం, పరస్పర దౌత్య ఆంక్షలు తీవ్రస్థాయి వివాదానికి దారితీశాయి.

## ఒడిశాలో పొడవని పొత్తు..

# బిజెపి, బిజెడి సొంతంగానే పోటీ



న్యూఢిల్లీ: రానున్న లోక్‌సభ, ఒడిశా అసెంబ్లీ ఎన్నికలలో కలసి పోటీ చేయడానికి సంబంధించి అధికార బిజూ జనతా దళ్(బిజెడి), భారతీయ జనతా పార్టీ మధ్య సీట్ల సర్దుబాటు చర్చలలో అనూహ్యంగా ప్రతిష్టంభన ఏర్పడింది. ఈ రెండు పార్టీలు రానున్న ఎన్నికలలో ఎవరికి వారే ఒంటరిగా పోటీ చేసే పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. రెండు కీలక నియోజకవర్గాలైన భువనేశ్వర్, పూరీపై ఏర్పడిన విభేదాలను పరిష్కరించడంలో శనివారం ఢిల్లీలో జరిగిన చర్చలు విఫలమయ్యాయి. ఒడిశాలోని మొత్తం 147 అసెంబ్లీ నియోజకవర్గాలు, 21 లోక్‌సభ నియోజకవర్గాలలో బిజెపి తన అభ్యర్థులను నిలబెడుతుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సమాల్ శుక్రవారం సాయంత్రం భువనేశ్వర్‌కు తిరిగివచ్చిన అనంతరం విలేకరులకు సూచనప్రాయంగా వెల్లడించారు. ఢిల్లీలో చర్చలు కేవలం ఎన్నికల సన్నాహాలకు సంబంధించి మాత్రమే జరిగాయని, సీట్ల పొత్తు లేదా కూటమి గురించి కాదని ఆయన స్పష్టం చేశారు. పొత్తులపై ఎటువంటి చర్చ జరగలేదని, తాము ఒంటరిగానే పోటీ చేస్తున్నామని సమాల్ చెప్పారు. రానున్న లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కోసం తాము చేస్తున్న ఏర్పాట్ల గురించి కేంద్ర నాయకులతో చర్చించేందుకు తాము ఢిల్లీకి వెళ్లామని ఆయన తెలిపారు. కాగా..సీట్ల పంపకాలపైనే రెండు పార్టీల మధ్య విభేదాలు తలెత్తాయని వర్గాల ద్వారా తెలిసింది. ఎన్నికలకు ముందుగానే సీట్ల సర్దుబాటు చేసుకోవాలని రెండు పార్టీలు తొలుత భావించినప్పటికీ సీట్ల పంపకాల విషయంలో ఏకాభిప్రాయం కుదరలేదని తెలుస్తోంది. 147 అసెంబ్లీ స్థానాలలో 100కి పైగా స్థానాలలో పోటీ చేస్తామన్న బిజెడి ప్రతిపాదనను బిజెపి వ్యతిరేకించినట్లు తెలుస్తోంది. ఒడిశాలోని 21 లోక్‌సభ స్థానాలలో 14 స్థానాలను తమకు కేటాయించాలని బిజెపి పట్టుపట్టినట్లు తెలుస్తోంది. దీనికి బిజెడి ససేమిరా అన్నట్లు వర్గాలు తెలిపాయి. రెండు పార్టీల మధ్య ఏకాభిప్రాయం రానందున చర్చలలో ప్రతిష్ఠంభన ఏర్పడినట్లు వారు చెప్పారు. కాగా..2019 లోక్‌సభ ఎన్నికలలో బిజెడి 12 స్థానాలలో గెలుపొందగా బిజెపి 8 స్థానాలను గెలుచుకుంది.

# ఎంపీ ఎలక్షన్స్ ఉన్నాయని కాంగ్రెస్ ఈ మాత్రం కరెంట్ ఇస్తోంది : హరీశ్ రావు



హైదరాబాద్ : కేసీఆర్ పాలనలో ఏ రోజు కూడా కరెంట్ పోలేదు.. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంట్ కోతలు మొదలయ్యాయని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. నిన్న ఒక ఊరికి వెళ్తే కరెంట్ కోతలు మొదలయ్యాయని రైతులు ఆవేదన చెందారని ఆయన గుర్తు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో అవకాశం కల్పించాలని కోరుతూ జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని మున్నూరు కాపు సంఘం నేతలు తెలంగాణ భవన్‌లో హరీశ్ రావును కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. మీ వినతిని పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ దృష్టికి తీసుకు వెళతాం. మీ ఆలోచనలను వివరిస్తాము. కేసీఆర్ ఎక్కువ మందికి అవకాశం ఇచ్చే వ్యక్తి. మున్నూరు కాపు నేతలకు గతంలోనూ ఎంతో మందికి అవకాశం కల్పించారని హరీశ్‌రావు గుర్తు చేశారు. కాంగ్రెస్ నేతలు వంద రోజుల్లో 13 హామీలు అన్నారు. డిసెంబర్ 9వ తేదీన రుణమాఫీ అన్నారు. ఎన్ని 9 తేదీలు మారినా రుణమాఫీ కావడం లేదని విమర్శించారు హరీశ్ రావు. బోనస్ విషయంలో దగా, రుణమాఫీ విషయంలో దగా, ఉచిత కరెంట్ విషయంలో దగా, రైతు బంధు విషయంలో దగా.. కాంగ్రెస్ పాలన అంటేనే దగా అన్నట్లు ఉంది. చెప్పుకుంటూ పోతే మొత్తం 420 దగాలు ఉన్నాయి. పార్లమెంట్ ఎన్నికలు ఉన్నాయని ఈ మాత్రం కరెంట్ ఇస్తోంది. ఎన్నికలు అయిపోతే కరెంట్ కోతలు పూర్తి స్థాయిలో ఉంటాయని హరీశ్ రావు అన్నారు. మోదీని బడే భాయ్ అని, ఎల్లప్పుడూ ఆయన ఆశీర్వాదం ఉండాలని రేవంత్ అన్నాడు. ఢిల్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం రాదు అని రేవంత్ చెప్పకనే చెప్పారు. దేశవ్యాప్తంగా రైతులు ఆందోళనలో ఉన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ వచ్చేది లేదు, ఇక్కడ కాంగ్రెస్ ఓడిపోతే పోయేదేమీ లేదు. కాబట్టి తెలంగాణ ప్రయోజనాల కోసం కొట్లాడే బీఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు. కాంగ్రెస్ హామీలు అమలు కావాలంటే బీఆర్ఎస్ పోరాటంతోనే సాధ్యం అవుతుందన్నారు. రుణమాఫీ, రైతు బంధు, కరెంట్, బోనస్ ఇవ్వనందుకు రైతులు ఏకమై వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చురక పెట్టాలన్నారు హరీశ్‌రావు. బాండ్ పేపర్ ఇచ్చి రైతులను మోసం చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదన్నారు. కాంగ్రెస్ ఓడిపోతేనే.. కాంగ్రెస్ హామీలు అమలు అవుతాయన్నారు. మార్చి నెలాఖరుకు ఎండలు ముదిరితే పంట సాగు ఎలా అని రైతులు ఆందోళన పడుతున్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని చిత్తు చిత్తుగా ఓడించాలన్నారు. రెండు సార్లు గేలిపిస్తే పార్టీకి మోసం చేశారు బీబీ పాటిల్. వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. దేశంలో కాంగ్రెస్‌కు ప్రధాన ప్రతి పక్ష హెూదా కూడా వచ్చే అవకాశం లేదని స్పష్టం చేశారు హరీశ్ రావు.

# పాక్ కొత్త అధ్యక్షుడిగా జర్దారీ ఎన్నిక

పాకిస్థాన్ దేశానికి 14వ అధ్యక్షుడిగా పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పిపిపి) సహ వ్యవస్థాపకుడు ఆసిఫ్ అలీ జర్దారీ శనివారం ఎన్నికయ్యారు. జర్దారీ పాకిస్థాన్ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఇది రెండోసారి.పిపిపి, పాకిస్థాన్ ముస్లింలీగ్ నవాజ్( పిఎంఎల్ఎన్) సంయుక్తంగా పాక్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అధికార కూటమి తరఫున 68 ఏళ్ల జర్దారీ అధ్యక్ష పదవికి బరిలో నిలిచారు. జర్దారీకి ప్రత్యర్థిగా సున్నీ ఇత్తెహాద్ కౌన్సిల్ పార్టీకి చెందిన 75 ఏళ్ల మహమూద్ ఖాన్ అచక్‌జాయ్ అధ్యక్ష పదవికి పోటీ పడ్డారు. రాజ్యాంగం ప్రకారం నేషనల్ కౌన్సిల్, నాలుగు ప్రొవెన్షియల్ అసెంబ్లీలకు కొత్తగా ఎన్నికయిన సభ్యులు కొత్త అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. జర్దారీకి 255 ఓట్లు రాగా, ఆయన ప్రత్యర్థికి 119 ఓట్లు వచ్చినట్లు పాక్ మీడియా పేర్కొంది. వ్యాపారంనుంచి రాజకీయాల్లోకి వచ్చిన జర్దారీ దివంగత పాక్ మాజీ ప్రధాని బేనజీర్ భుట్టో భర్త. పాకిస్థాన్ 13వ అధ్యక్షుడు డాక్టర్ ఆరిఫ్ అల్వీ పదవీ కాలం గత ఏడాదితో ముగియడంతో నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. జర్దారీ గతంలో 2008నుంచి 2013 వరకు పాక్ అధ్యక్షుడిగా పని చేశారు. పాకిస్థాన్ జాతీయ అసెంబ్లీ ఎన్నికలు ఆలస్యం కావడంతో అధ్యక్ష ఎన్నికలు కూడా ఆలస్యమయ్యాయి. కొత్త ఎలక్టోరల్ కాలేజి ఏర్పాటయిన తర్వాత అధ్యక్షుడిని ఎన్నుకున్నారు.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com